ENTERED
కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మే 4, 2008



ఆంధ్రా 'ఊటీ'లు

హ్యాపీబర్త్‌డే

(2008 మే-4 నుంచి
2008 మే-10 వరకు)

పవన్‌కుమార్
మే॥7
ఉపేంద్ర-వెంకన్న
డోర్నకల్-వరంగల్

సింధు
6సం॥, మే॥6
జ్యోతి-తిరుపతిరావు
శ్రీనగర్‌కాలనీ-ఖమ్మం

భాను తేజ-నవీన్‌కుమార్
1సం॥ మే॥6
అనురాధ-మహేష్‌కుమార్
రాజాం-శ్రీకాకుళం

డి. మోని
4సం॥ మే॥6
శోభారాణి-కామరాజు
విశాఖపట్నం

కె. వీణాఈష్
మే
మల్లేశ్వరి-శ్రీనివాసరావు
పట్టాభిరెడ్డిగార్డెన్స్-విశాఖపట్నం

ఒ. అనిరుధ్‌కృష్ణ
3సం॥, మే॥9
అంజనీకృష్ణ-గోపాలకృష్ణ
రాంజీనగర్-నెల్లూరు

ఎస్. నవదీప్
2సం॥, మే॥9
వెంకటలక్ష్మి-నారాయణ
ఇదుపూడు-ప్రకాశం

శ్రీతేజ-శ్రీలేఖ
అన్నపూర్ణ-రాజశేఖర్‌రావు
ఉండవల్లి
సెంటర్-గుంటూరు

రాజనందిని
3సం॥ మే-2000
విజయ-వెంకటేశ్వర్లు
డోర్నకల్-వరంగల్

టి. గౌరిసాయి తేజస్వి
కన్యాకుమారి-
సాంబశివరావు
తుళ్లూరు-గుంటూరు

వి. మణికంఠ
మే॥9
కాటమ్మ-వెంకటరంగయ్య
కంభం-ప్రకాశం

వి. శ్రావణి
6సం॥, మే॥9
కోటమ్మ-రంగయ్య
కంభం-ప్రకాశం

ఇ.భరద్వాజ్
3సం॥ మే-2005
మంజుల-రామకృష్ణ
నాగర్‌కర్నూల్-యం.నగర్

ప్రియాంక
10సం॥ మే-2000
వసంత-రమేష్
బురహాన్‌పురం-ఖమ్మం

వి. సాయి మేఘన
7సం॥ మే-2001
సరిత-సీతారాములు
డోర్నకల్-వరంగల్

ఎన్.రూతి
2సం॥ మే-2006
రోజా-రమేష్
ఆర్.కె.నగర్-ఖమ్మం

కె. రాజేష్
2సం॥ మే-2006
సుజాత-వీరాచారి
గజపతినగరం

కె. మోహన్‌కృష్ణ
3సం॥ మే-2005
సుజాత-వీరాచారి
గజపతినగరం

బి. మణికంఠ
6సం॥ మే-5
కోమలి-శ్రీనివాసరావు
కంభంపాడు-కృష్ణా

ENTERED



నిలయం
శ్రీకాకుళం

డబ్బు సంపాదనే ముఖ్యం కాదు

మన అతిథి

పేరు	:	సిసింతి శివాజీ
తల్లిదండ్రులు	:	సుందరమ్మ, రఘునాథన్
పుట్టిన తేది	:	17.6.1950
స్వస్థలం	:	బరంపురం, ఒరిస్సా
విద్య	:	ఎంఎస్సీ, పిహెచ్‌డి
వృత్తి	:	సిసిఎంబి డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌ఛార్జి లాకోన్స్
నచ్చిన వ్యక్తులు	:	మదర్ థెరిస్సా
బలం	:	పని చేయడం
బలహీనత	:	నిజాయితీ
మరచిపోలేని సంఘటనలు	:	అంటార్కిటికా, ఆర్కిటిక్ ఖండాలను, హిమాలయ పర్వత శ్రేణులను పరిశోధన నిమిత్తం సందర్శించడం
అలవాట్లు	:	వివిధ ప్రాంతాలను పర్యటించడం, టీవీ చూడడం
ఆశయం	:	సైన్స్ సహాయంతో మానవాళికి సేవచేయడం
అవార్డులు	:	భారత ప్రభుత్వ అంటార్కిటికా అవార్డ్ (బయోలాజికల్ సైన్స్), ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఫెలో ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఫెలో ఆఫ్ జూలాజికల్ సొసైటీ ఆఫ్ లండన్
చిరకాల లక్ష్యం	:	అంతరించిపోతున్న జంతుజాతిని క్లోనింగ్ పద్ధతి ద్వారా విజయవంతంగా ఆవిష్కరించడం

సంస్కృతి, సాంప్రదాయాలకు నెలవు మన రాష్ట్రం. ఇక్కడ కేవలం తెలుగు వారే కాక, వివిధ సంస్కృతులకు చెందిన వారున్నారు. రాష్ట్రాన్ని విభిన్న సంస్కృతుల నిలయంగా పేర్కొనవచ్చు. మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ, ఇతరుల సాంప్రదాయాల్లోని మంచిని అలవర్చుకుంటున్నాం. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, బిపిఓ ప్రభావం మన సంస్కృతిపై కొద్దిగా ఉంది. ఐటి వల్ల రాష్ట్రం గణనీయంగా ఆర్థికాభివృద్ధి సాధించింది. దీంతోపాటు పాశ్చాత్య సంస్కృతిని అలవర్చుకోవడం మొదలైంది. ఇది తాత్కాలికమే. మరో ఐదు, పదేళ్లలో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుంది. అకస్మాత్తుగా ఐటీ ఉద్యోగాలు రావడం, చిన్న వయసులో ఐదంకెల జీతాలు రావడంతో స్వార్థం చోటుచేసుకుంటోంది. ఇప్పటి పరిస్థితుల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండడం కష్టం. అయితే ఇది మళ్లీ తిరిగి వస్తుందని ఆశించవచ్చు. అంతమాత్రాన బంధాలు, సంబంధాలు లేవని అనుకోకూడదు. డబ్బు సంపాదనే ముఖ్యం కాదన్న అవగాహన యువకుల్లో కల్పించాలి. కెరీర్ ముఖ్యం. అయితే ఏదో విధంగా సంపాదించాలనే ఆలోచన కూడదు.

Shivaji

ఈ సంచికలో....

టపా ... 2
ఆరోగ్యం ... 3
సీరియల్ ... 8
సినిమా ... 10
మనసా... తెలుసా ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
విజ్ఞాన వీచిక ... 20

ఇంకా...

చూద్దామా ... 4
మున్నార్ దక్షిణ కాశ్మీర్

మంచిపుస్తకం ...6
సమాచార సమృద్ధమైన సమగ్ర వ్యాసావళి

సమ్‌థింగ్ స్పెషల్ ... 21
సలహాలు ... 22
రుచి ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ ... 18
పాప తల్లి



చక్కటి సందేశాన్నిచ్చింది

'సైన్సు పెరిగినా ఈ సంక్షోభమేంటి?' వ్యాసం ఎవరికైనా చదవాలనిపిస్తుంది. ప్రపంచాన్ని అత లాకుతలం చేసే ఆహార సంక్షోభం గురించి ముందుగానే పది సంవత్స రాల క్రితమే ప్రపంచానికి తెలియ పరచిన వ్యక్తి కాస్ట్రో. దీన్నిబట్టే సామాన్య ప్రజల మీద, రైతుల మీద వారికి వున్న అపారమైన ప్రేమ ఎంతో అర్థమౌతుంది. ఆహార పదార్థాలను కార్ల ఇంధనంగా వాడటం వంటి దారుణాలు ఆహార దుస్థితికి కారణాలు అవుతాయని దానికి అమెరికాయే కారకురాలని పది సంవత్సరాల క్రితమే కాస్ట్రో చెప్పటం చాలా గొప్ప విషయం. సైన్సు, సాంకేతిక నైపుణ్యం పెరిగి పంటలు ఎక్కువగా పండుతున్నాయి. రైతులు అధిక పంటలు పండించికూడా దుస్థితి పాలు కావటానికి అమెరికా ప్రారంభించిన కార్పొరేట్ వ్యవసాయరంగ ప్రవేశమే నని చెప్పారు. దాని వలన చిన్న సన్నకారు రైతులు మనుగడ కోల్పో తారని చెప్పారు. ఈ వ్యాసం చక్కని సందేశాన్నిస్తోంది.

మురళీధర్, విజయవాడ.

'పుస్తకం' వెనుక చాలా కథ వుందే!

"పుస్తకం" తయారైన విధం, సందర్భం "రాత" అభివృద్ధి చెందిన విధానంపై 20-4-08 నాటి ఆదివారం 'ప్రజాశక్తి అను బంధం అట్టమీది కథ" ద్వారా మాకు తెలిని ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. కాగితం తయారీ గురించి, కాలిగ్రఫీ గురించి ఎన్నో విషయాలను ఈ వ్యాసం ద్వారా తెలుసుకోవడానికి అవకాశం లభించింది. అలాగే, ఆహార పదార్థాలను కార్లకు ఇంధనంగా వాడితే జరిగే దుష్పరిణామాలను గురించి క్యూబా నేత కాస్ట్రో చెప్పిన విషయాలు నేడు వాస్తవ రూపాన్ని దాల్చడం ఆశ్చర్యం కల్గించింది. కానీ ప్రపంచదేశాలు ఈ విషయాలను సీరియస్‌గా తీసుకోకపోవడం నిజంగా బాధా కరం. అమెరికా వంటి అగ్ర రాజ్యాధి నేతలు ఇప్పుడైనా కళ్ళు తెరచి వాస్తవ పరిస్థితులను గ్రహించి ఆకలి చావులను తగ్గించడానికి తమ కృషిని వెంటనే ప్రారంభిస్తే బాగుంటుంది. ఈ వేసవి సెలవులను పురస్కరించుకొని విద్యార్థులకు ఉపయోగపడే శీర్షికలు ఏవైనా ప్రారంభిస్తే బాగుంటుంది. ధన్యవాద్యాలు.

గొల్లమండల సురేష్‌కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

అబ్బో... ఎన్ని విషయాలో...

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో ఆధునిక యుగంలో కలం, కాగితం లేకుండా ఏమీ లేదని అట్టమీది కథలో, అర్థమయ్యే రీతిలో ఇచ్చినందుకు నమస్కారాలు. నిజంగా పుస్తకాలు లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టం. అక్షరం ఎలా పుట్టింది? ఆనాటి ఆదిమానవుడు ఏవిధంగా లెక్కకట్టాడు? క్రీస్తు పూర్వం 8500 సంవత్సరపు ఆలోచనా విధానం ఎలా వుంది? తొలి వ్యాపార రికార్డులు ఎలా వున్నాయి? అన్న అంశాలను చాలా చక్కగా వివరించారు. మాటల కన్నా పది కాలాల పాటు నిలిచి వున్నది రాతేనని మానవుని జీవితం రాతమీదే ఆధారపడి వుందని నిజంగానే మనం గ్రహించిన సత్యం. పాపిరస్ మొక్క నుంచి పేపర్ వచ్చిందని... మొదట నిజమైన అక్షరాలు క్రీ.పూ. 1800-1300 మధ్య సెమిటిక్ ప్రజల ద్వారా అభివృద్ధి చెందాయని... కానీ క్రైస్తవం వ్యాప్తి చెందడంలో బైబిల్‌ని ఇతర భాషలో తర్జుమా చేయాలి గనుక అక్షరాలు ఇంకా వేగవంతంగా అభివృద్ధి చెందాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. భారతదేశ అక్షరాలు అరామిక్ లిపి నుండి పుట్టాయని... అసలు భారతదేశంలో సున్నా పుట్టిందని .... దాని విలువ లెక్కలలో బాగా వుందని, అలాగే అచ్చు యంత్రం తెచ్చిన విప్లవం గూటెన్ బర్గ్ అద్భుత సృష్టిని గూర్చి ప్రత్యేకంగా వివరించినందుకు ధన్యవాదాలు. ఏదిఏమైనా అక్షరాలు.. కాగితాలు... పుస్తకాలు అంటూ మాతో విజ్ఞాన విషయాలు ముచ్చటించిన స్నేహకు ప్రత్యేకమైన ప్రేమాభివందనాలు.

కర్రా వరప్రసాద్, యలమర్రు, కంద్రిక.

వనమాలిని పరిచయం చేసినందుకు అభినందనలు

స్నేహ పాఠకులకు మూడు వారాల పాటు గేయ రచయిత వనమాలి చెప్పిన కబుర్లు ఎన్నో విషయాలను తెలిపాయి. అందుకు కృతజ్ఞతలు. వనమాలి పాపులర్‌గా రాసిన 'ప్రేమేనంటావా, ప్రేమే నంటావా నీకై ఇన్నాళ్ళు వేచానంటావా' పాట మేము మరచిపోలేని, అపూర్వమైన పాట. అలాగే శివపుత్రుడులోని 'చిరుగాలి వీచెనే, చిగురాశ రేపనే' పాట సూపర్ హిట్ అయ్యింది. ఈ పాట వింటుంటే హృదయం కరిగిపోతుంది. అలాగే నోట్‌బుక్, టైం, హ్యాపీడేస్ ఇలా ఎన్నో చిత్రాలకు ఆయన రాసిన పాటలు బాగున్నాయి. వన మాలిగారు ఎన్నో విజయాలు సాధించి మరెన్నో అవార్డులను అందుకోవాలని కోరుకుంటున్నాము. వనమాలి గారిని, పరిచయం చేసినందుకు స్నేహకి అభినందనలు.

అనుపోజు సత్యనాగరాజు, రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

నమ్మలేకపోయాం

20 ఏప్రిల్, 2008 నాటి సంచికలో డా॥ విజయ్‌గారి 'పుస్తక ప్రపంచం' ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. బ్రహ్మీలిపి, కాగితం కథ విశేషాలు ఆకలింపు చేసుకున్నాం. రాతిగుహల్లో 'రాతి ముక్కలతో అయినా సరే రాత అదే. మొదటి గీత గీసిన రాతి యుగపు మానవుడే మన భవిష్యత్తు రాత రాసింది' అన్న వాక్యంలో ఏదో నిజం దాగుందనిపించింది. అన్నట్టు.... ఆదిమూలం శేఖర్ అందించిన 'మనసుదోచే దారాల పూదోట' చూసి అదంతా కృతిమంగా ప్లాస్టిక్‌తో, యంత్రాలతో తయారు చేసిందికాదంటే నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉన్నాయి. సత్తార్ కార్టూన్లన్నీ

సామాజిక స్థితిగతుల నేపథ్యంలో ఉండడం అభినందనీయం. ఓ మంచి పుస్తకంగా "విశ్వ విజ్ఞాన దర్శిని" పుస్తక పరిచయం బాగుంది. ఒక మంచిపుస్తకాన్ని గురించి తెలియజేశారు. ప్రపంచీ కరణ నేపథ్యంలో వస్తున్న మార్పుల కనుగుణంగా మనమూ మారుతూ సమాజంలో వస్తున్న మార్పులను ఆహ్వానిస్తూ... కష్టపడాలనీ, అభి వృద్ధి చెందడానికి, అడ్డదారులు ఏమీ లేవని పేర్కొంటున్న, మన అతిథి లక్కసాని వేణుగోపాల రెడ్డి గారి అభి ప్రాయాలు అక్షరలక్షలు చేసేవిలా ఉన్నాయి. కృతజ్ఞతలతో..

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం టౌన్.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహి తులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పా హారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదల చుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

కథా నిలయం
శ్రీకాకుళం

డాక్టర్ ఎస్.విజయకుమార్ రెడ్డి,
కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, మెడిసిటీ హాస్పిటల్స్,
హైదరాబాద్. ఫోన్: 9440054930.

గుప్పెడు గుండెను కాపాడుకుందాం...



వేసవి కాలం శరీరంలో నీరు తగ్గిపోతే బాగా దాహం వేస్తుంది. నీరసం, బలహీనపడడం, కండరాలు పట్టేయడం, తల తిరగడం జరుగుతుంది. నీరు బాగా తగ్గిపోతే కళ్లు తిరిగి పడిపోతారు. లేదా అపస్మారక స్థితికి చేరు కుంటారు. చర్మం, నాలుక పొడిగా అవుతాయి. రక్తపోటు తగ్గి గుండెపై ప్రభావం చూపుతుంది. గుండెపోటు వచ్చిన వారిలో అతి తక్కువ వ్యవధిలో వ్యాధి నిర్ధారణ జరగడం, సంబంధిత వైద్యం చేయడం ముఖ్యం. ఎందుకంటే 25 శాతం గుండె పోటు రోగులు ఆసుపత్రికి చేరే లోగానే చనిపోయే అవకాశముంది.

ఎలా గుర్తించాలి?

ఛాతీ మధ్యలో... ఛాతీ ఎముక వెనుక భాగంలో... బరువుగా లేదా ఆయాసం, మంటగా అనిపిస్తుంది. ఇలా పదిహేను నిమిషాల కంటే ఎక్కువగా ఉంటే అది గుండెపోటుగా భావించాలి. ఈ బాధ రెండు చేతులకు గానీ, గొంతు నుంచి నాభి వరకుగానీ, వెన్నులోకి గానీ వెళ్లినట్లయితే గుండె నొప్పి అవటానికి అవకాశం ఎక్కువ. దీనికి వయసుతో నిమిత్తం లేదు. నొప్పి వల్ల గాబరా, చెమట పట్టడం, దడ, బలహీనత వస్తాయి. గుండెకు రక్తం సరఫరా చేసే ధమనుల్లో కొవ్వు చేరి దానిపై రక్తం గడ్డకట్టడం వల్ల గుండె పోటు వస్తుంది.

బాధితులెవరు ?

మధుమేహం, రక్త పోటు వున్నవారు, స్థూలకాయులు, ధూమపానం చేసేవారు, తమ రక్తసంబంధీకుల్లో గుండె జబ్బులున్నవారు, శారీరక వ్యాయామం లేనివారు, రక్తంలో హైకొలెస్ట్రాల్ ఉండి, మానసిక ఆందోళనతో బాధపడేవారిలో గుండెపోటు ఎక్కువగా వస్తుంది. సిగరెట్ తాగే వారి గుండె ధమనుల్లో రక్తం ఎక్కువగా గడ్డకట్టి అకస్మాత్తుగా కార్డియాక్ డెత్ సంభవించవచ్చు. మధుమేహం ఉన్న వారిలో గుండెపోటు లక్షణాలు కొట్టొచ్చినట్లు కనపడవు. వీరిలో ఆయాసం, బాగా చెమట పోయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొవ్వు ఎక్కువ ఉన్న వారిలో ఎల్‌డిఎల్ అనే చెడు కొవ్వు 160 కంటె ఎక్కువగాను, హెచ్‌డిఎల్ (సహాయ కొలెస్ట్రాల్) 40 కంటె తక్కువగాను వుంటే గుండె పోటు వచ్చే అవకాశం ఎక్కువ. హోమోసిస్టెన్, లైపోప్రొటీన్ అనే కొవ్వు పదార్థం రక్తంలో అధికంగా ఉండటం ఒక కారణం.

తక్షణ వైద్యం అవసరం...

గుండెపోటు వచ్చినట్లు గుర్తించడం ఒక ఎత్తైతే దానికి మొదటి గంటలోనే వైద్యం చేయించడం చాలా ముఖ్యం. గుండెనొప్పి వచ్చిన వారిని వీలైనంత వరకు సమతలంగా ఉంచడం మంచిది. దీని వల్ల మెదడుకు రక్త ప్రసరణ తగ్గకుండా ఉంటుంది. బిగుతుగా ఉన్న బట్టలను వదులు చేయడం, మంచి గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో ఉంచడం వల్ల ఆక్సిజినేషన్ పెరుగుతుంది. దగ్గర్లోని ఆసుపత్రికి తరలించాలి. వీరికి కరోనరి యాంజియోగ్రామ్ పరీక్ష చేసి ఏ ధమనిలో రక్తం గడ్డకట్టింది, ఎంత శాతం కొవ్వు బ్లాక్ అయ్యిందో నిర్ధారించి బెలూన్ ట్రీట్‌మెంట్ గాని, బైపాస్ ఆపరేషన్ గాని, స్టంట్ గాని చేస్తారు. గడ్డకట్టిన రక్తం పూర్తిగా కరిగిపోయిన వారిలో మందులతోనే వైద్యం చేయవచ్చు. గుండె పోటు వచ్చిన మొదటి గంటలోనే యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ ద్వారా చికిత్స చేయవచ్చు.

గుండెజబ్బు రోగికి సలహాలు

కొందరికి గుండెజబ్బు అంత ప్రమాదకరంగా లేకపోవచ్చు. ఇంకొందరికి గుండె. పెరిగి ప్రమాదకరంగా మారవచ్చు. కొందరికి మందులు వాడటం తప్ప మరో మార్గంలేని గుండె జబ్బులు వుంటే మరికొందరికి సర్జరీ చేస్తే చాలా వరకు రిలీఫ్ రావచ్చు. అందుకని గుండెజబ్బు ఉన్నవాళ్లు డాక్టర్ సలహాలు పాటించాలి. మానసికంగా బాధలు వుండకూడదు. మనస్సును ప్రశాంతంగా వుంచుకోవడం అత్యవసరం.

రిలాక్సేషన్ టెక్నిక్ ప్రాక్టీసు చేస్తే టెన్షన్స్‌ని, మానసిక ఆందోళనలను చాలా వరకు అధిగమించవచ్చు. గుండె జబ్బు వున్నవాళ్లు ఎక్కువ శారీరక శ్రమ చేయకూడదు. కనీసం ఎనిమిది గంటలైనా నిద్రపోవాలి. కడుపునిండా తినకూడదు. ఆకుకూరలు, పండ్లు కాయ గూరలు ఎక్కువగా తీసుకోవాలి. గుండెజబ్బు వున్నవాళ్లు డాక్టరు సలహా మేరకు రోజూ వ్యాయామం చేయాలి. యాంజైనా గుండెజబ్బు వున్న వాళ్లకి, గుండెపోటు నుంచి కోలుకున్న వాళ్లకి, బైపాస్ సర్జరీ చేయించుకున్న వాళ్లకి నడక మంచి వ్యాయామం. ఇటువంటి వ్యాయామం గుండెను ఆరోగ్యంగా వుంచుతుంది.

జాగ్రత్తలు...

రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రిం చుకోవాలి. ❖ పొగతాగడం వెంటనే మానేయాలి. ❖ మత్తు పానీయాల జోలికి పోవద్దు. ❖ శరీరంలో కొలెస్ట్రాల్ శాతం ఎప్పటికప్పుడు పరీక్షించు కోవాలి. ❖ ప్రతిరోజూ క్రమం తప్పకుండా 30 నిముషాల పాటు శారీరక వ్యాయామం చేయాలి. ❖ ప్రతిరోజూ మీ ఆహారంలో అన్ని రకాల కూరలతో పాటు పండ్లు, ధాన్యాలు ఉండాలి. ❖ కొవ్వు, ఉప్పు, తీపి అధికంగా ఉన్న పదార్థాలను తినడం మానేయాలి. ❖ మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి. ❖ స్థూలకాయులకు గుండె జబ్బులు వచ్చే అవకాశాలు అధికం. కాబట్టి స్థూలకాయాన్ని తగ్గించుకోవాలి. ❖ ఉప్పు అధికంగా వాడడం వల్ల రక్తపోటు పెరిగే అవకాశం ఉంది. రోజుకు మూడు గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలి. ❖ వారంలో మూడుసార్లు ఆకు కూరలు తింటే గుండె జబ్బులు వచ్చే అవకాశలు 67 శాతం తగ్గు తాయి. ❖ 20 నుంచి 35 సంవత్సరాల వాళ్లు ప్రతి సంవత్సరం చెక్ చేయించుకోవాలి. ❊

తాజా పరిశోధన.....

మరో రెండేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా నమోదయ్యే గుండె జబ్బుల కేసుల్లో 60 శాతం మన దేశంలోనే ఉంటాయని తాజా పరిశోధన వెల్లడించింది. మన దేశం, కెనడాకు చెందిన పరిశోధకులు అధ్యయనాన్ని నిర్వహించారు. గుండె జబ్బుల గురించి సమగ్రమైన సమాచారాన్ని వీరు సేకరించారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెంటనే చేరే అవకాశం లేకపోవడం ప్రధాన అవరోధమని వీరు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 70 లక్షల మంది గుండెజబ్బులతో మరణిస్తున్నారు. గుండె జబ్బుల బాధితులు తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలను ఈ సమాచారం ఆధారంగా గుర్తించే వీలుందని అమెరికాకు చెందిన గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కిమ్ ఇగల్ అన్నారు. ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న భారత దేశాన్ని గుండె జబ్బులు బెంబేలెత్తిస్తున్నాయి. గుండెపోటుతో బాధపడే 21,000 మందిపై పరిశోదనా బృందం అధ్యయనం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 50 నగరాల్లోని 89 ఆసుపత్రుల్లో వీరిని చేర్చారు. ధూమపానం, రక్తంలో కొవ్వు శాతం అధికంగా ఉండడం, అధిక రక్తపోటు గుండెజబ్బులకు కారణాలు. కాగా ఆసుపత్రులు అందుబాటులో లేకపోవడం ఒక సమస్యగా మారింది. భారత దేశంలో ఆసుపత్రికి చేరాలంటే సరాసరి 300 నిమిషాలు పడుతోంది. అతి కొద్ది మందిమాత్రమే అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి చేరుతున్నారు. రొటీన్‌గా చేయించుకునే చికిత్సకు పేదరికం అడ్డంకిగా మారింది.

యాజీవ్



మున్నార్ దక్షిణ కాశ్మీర్

హిల్ స్టేషన్లు అనగానే అవేవో ఉత్తర భారతదేశంలోనే ఎక్కువగా ఉన్నాయని చాలా మంది అపోహపడుతుంటారు. దక్షిణ భారతంలో కొడైకెనాల్, ఊటీలతో పాటు చూడదగ్గ హిల్‌స్టేషన్ మున్నార్. కేరళలోని కొచ్చిన్‌కి సుమారు 150 కిమీ దూరంలో 'ఇడుక్కి' లో ఉంది మున్నార్. ప్రశాంతమైన వాతావరణంతో మనసులు దోచే మున్నార్‌ని 'దక్షిణ కాశ్మీర్' అని కూడా అంటారు! దక్షిణ భారతదేశంలోని బ్రిటీష్ వారికి ఒకప్పటి వేసవి రాజధాని ఈ మున్నార్. అంటే- బ్రిటీష్ వారు అభివృద్ధి పరచిన మరో హిల్‌స్టేషన్ అన్నమాట!

మున్నార్ అంటే మూడునదులు అని అర్థం. నల్లతణ్ణి, ముద్రపూజ, కుండల అనే మూడు కొండవాగుల సంగమం మున్నార్. ఆ కలయిక సముద్ర మట్టానికి 5000 అడుగుల ఎత్తున జరుగుతుంది.

ఆకట్టుకునే టీతోటలు

కొచ్చిన్ నుండి బయటకు వచ్చిన కొద్ది దూరంలోనే పచ్చని రబ్బరు చెట్లు కనిపిస్తాయి. మున్నార్ చేరగానే టీ తోటలు దర్శనమిస్తాయి. డార్జిలింగ్ లోనూ టీ తోటలు విస్తారంగా వున్నా మున్నార్‌లోని తోటలు ప్రత్యేకంగానూ, మరింత ఆకర్షణీయంగానూ కనిపిస్తాయి.

నీలపు లోయలు

ఎటు చూసినా పచ్చగా కనిపించే కొండలు, లోయలు అప్పుడప్పుడూ నీలంగా కనిపిస్తాయి. ఊటీ, కొడైలాగే ఈ నీలానికి కారణం 12 ఏళ్ళకోసారి పుష్పించే నీలకురించి పూలు, మున్నార్‌లో రెండేళ్ళ క్రితం ఈ పూలు పుష్పించాయి. మున్నార్‌లో అపురూపమైన వన్యప్రాణి సంపద ఉంది. అరుదైన మొక్కలతో పాటు ఏనుగులు, నీలగిరి లంగూర్ అనే మర్కటజాతి ఎక్కువగా కనిపిస్తుంది. ఇన్ని వున్నా బ్రిటీష్ కాలం నాటి తేయాకు తోటలే ప్రత్యేక ఆకర్షణలు.

అబ్బో...ఎన్నిరకాల పశువులో....

మున్నార్‌కి 13 కిమీ దూరంలో, కొడైకెనాల్ రోడ్డులో మట్టుపెట్టి/ మదుపెట్టి డ్యాం ఉంది. దీనికి దగ్గరలోనే ఒక డైరీఫాం ఉంది. దాదాపు 100 రకాల పశువులను చూడవచ్చు. ఇక్కడ 11 షెడ్లున్నాయి. వాటిలో మూడు షెడ్లు చూడటానికి సందర్శకులను అనుమతిస్తారు. డ్యామ్ మాత్రం ఒక ఆహ్లాదకరమైన పిక్‌నిక్ స్పాట్. మదుపెట్టి, కుండల సరస్సులలో పడవ విహారం బావుంటుంది. మదుపెట్టిలో మరో విశేషం ఉంది. ఫిబ్రవరి మాసంలో మామిడిపండ్లు దొరుకుతాయి! స్ట్రాబెర్రీలు, క్యారట్‌లు విరివిగా లభిస్తాయి.

లాహిరి లాహిరిలో...

1700 మీటర్ల ఎత్తున పిక్‌నిక్‌కి వెళితే ఎలా వుంటుంది! భలే ఆనందంగా అనిపిస్తుంది గానీ, సరస్సు నిండా నూనె కాలుష్యమే. అయినా సరే పొడవాటి క్యూలు కట్టి, ఓ రెండొందల రూపాయలు చెల్లించి, పావుగంట పడవ షికారు కోసం జనాలు వేచి చూస్తూ ఉంటారు.

అరిస్తే...దద్దరిల్లుద్ది

దీనికి దగ్గరలోనే 'ఎకో పాయింట్' అనే ప్రదేశం ఉంది. పర్వత శ్రేణులలో ప్రతిధ్వనులు సహజం. ఇక్కడ నుండి కూడా ప్రతిధ్వనులు స్పష్టంగా వినిపిస్తాయి. ఇక్కడి చేరిన వారందరూ రకరకాల అరుపులు అరుస్తుంటారు. దాంతో కొండలు దద్దరిల్లి పోతుంటాయి.

కొండలెక్కగలరా!

ఇవికాక 'పోతియమేడు' అనే ప్రదేశం ఉంది. మున్నార్‌కి ఆరు కి.మీ దూరంలో ఉంది ఇది. ఇక్కడ యాలకుల తోటలు బావుంటాయి. కొండలక్కే ఔత్సాహికులకు ఇది బాగా అనువైన చోటు.

మున్నార్ టీ తోటలకి ప్రసిద్ధి. టాటా టీ ముఖ్య కేంద్రం ఇక్కడే ఉంది. దాదాపు అన్ని తేయాకు తోటలూ టాటాకి



చెందినవే.

అపురూపమైన వనసంపద

మున్నార్ నుండి నలభై అయిదు నిమిషాల దూరంలో ఎరావికులమ్ (రాజమలై) జాతీయ వనం ఉంది. సుమారు 97 చదరపు కిమీ విస్తరించిన ఈ పార్క్‌లో అపురూపమైన వన సంపద ఉంది. ఈ వనంలోనే దక్షిణ భారతంలో అత్యంత ఎత్తైన శిఖరం – 'అనముడి' శిఖరం ఉంది. దీని ఎత్తు 2695 మీటర్లు. కాస్త జాగ్రత్తగా చూస్తే ప్రపంచంలో అతి పెద్ద మాత్ (పట్టు పురుగుల జాతికి చెందిన ఒక కీటకం) కనిపిస్తుంది. దాని పేరు అట్లాస్ మాత్.

పక్షుల ఆవాస కేంద్రం

ఎర్నాకులం మున్నార్ మధ్యలో సలీం అలీ పక్షుల ఆవాసకేంద్రం ఉంది. ఎన్నో రకాల పక్షులతో ఈ ప్రదేశం అద్భుతంగా అనిపిస్తుంది. కానీ దీనిని చూడాలంటే కాస్త ముందుగా ప్రోగ్రాం వేసుకొని వెళ్లడం మంచిది.

ఇక మున్నార్‌లోనే క్రైస్ట్ చర్చ్ (ఇది 1910 నాటిది), హై రేంజ్ క్లబ్ (టేక్ తో నిర్మించిన ఈ క్లబ్ అప్పట్లో తేయాకు తోటల యజమానులకు ఆటవిడుపు గా ఉండేది), 1900లో కట్టిన మున్నార్ సప్లై అసోసియేషన్ స్టోర్ వంటివి చాలానే ఉన్నాయి.

హిల్‌స్టేషన్లనగానే చలి, స్వచ్ఛమైన కొండ గాలులు, ఎటుచూసినా ప్రకృతి అందాలు గుర్తుకు వస్తాయి. మున్నార్‌లో అవేవీ తక్కువ కావు, పైగా మిగతా వాటితో పోల్చి చూస్తే కాస్త ఎక్కువే –ఒక్క చలి తప్ప! కాకపోతే ఎంతో శ్రమపడి హిల్‌స్టేషన్లకు వెళ్ళి, లాడ్జిలలో విశ్రాంతి తీసుకోవడం కాకుండా అసలు ప్రదేశం నుండి కాస్త దూరంగా, ప్రశాంతంగా వెళ్ళి బోలెడన్ని అందమైన అనుభూతుల్ని మూటగట్టి తెచ్చుకోవడంలోనే మజా ఉంటుంది.

వీడియోలు, ఫొటోలతో, ఇంటి కొచ్చాక మంచి డైరీలాగానో, డాక్యుమెంటరీ లాగానో వాటిని అమర్చుకుంటే అప్పుడప్పుడూ అందరితో పంచుకోవడానికి బావుంటుంది. విహార యాత్ర మొక్కుబడిగా (తీర్థ యాత్రల మాదిరిగా) కాకుండా వినోదం, విజ్ఞానంతో బాటు మనకు ప్రత్యేకమైన అనుభూతుల్ని ఇస్తుంది.

కొచ్చి నుండి మున్నార్‌కి 140 కిమీ. అయితే సుమారు నాలుగున్నర గంటల కొండదారి ప్రయాణం. కాని విపరీతమైన ట్రాఫిక్ ఆ ప్రయాణాన్ని మరో రెండు గంటలు పెంచుతుంది.

ఆహ్లాదాన్ని అందించే 'ఆడిమలి'

దారిలో 'ఆడిమలి' అనే ఊరుంటుంది. ఇక్కడి నుండి మున్నార్‌కి 30 కీమీ దూరం ప్రయాణించాలి. అయినా ప్రయాణం మాత్రం గంట పడ్తుంది. మున్నార్ చేరుతున్న కొద్దీ పరిసరాలలో మార్పు, వాతావరణంలో ఆహ్లాదం పెరుగుతుంది. కొడై రోడ్డు ద్వారా కూడా మున్నార్ చేరవచ్చు. ఘాట్ రోడ్డు ప్రయాణం, 17 అతి సన్నని మలుపులు ఈ ప్రయాణాన్ని ప్రత్యేకం చేస్తాయి. కోయంబత్తూర్ నుండి మున్నార్ 150 కీమీ దూరంలో ఉంటుంది. కానీ ఈ మార్గంలో ప్రయాణం కాస్త సౌకర్యవంతంగా ఉంటుంది.

మున్నార్‌కి దగ్గరలోని రైల్వే స్టేషన్లు

కొచ్చి (13 కీమీ), కొట్టాయం (147 కీమీ) మధురై (162 కీమీ). అలాగే కొట్టాయం, టెక్కడి, మధురై, త్రిస్సూర్ నుండి బస్సు మార్గంలో కూడా మున్నార్ చేరవచ్చు.

❋





తెర

ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన 'సమగ్ర వ్యాసావళి' అక్షరాలా అలాంటి పుస్తకం. సామాజిక రంగం, రాజకీయ సమస్యలు, శాస్త్ర విజ్ఞానం, ఆర్థిక రంగం, ప్రపంచీకరణ, చరిత్ర విభాగాలకు సంబంధించిన వ్యాసాలు ఇందులో పొందుపర్చి వున్నాయి.

ఈ పుస్తకం విద్యార్థులకే పరిమితమైంది కాదు. రాజకీయ కార్యకర్తలకూ, అన్ని రకాలైన అధ్యయనశాలులకూ వివిధ సందర్భాలకు దోహదపడేంత విస్తృత స్వభావం కలిగింది.



సమాచార సమృద్ధమైన సమగ్ర వ్యాసావళి

సభా వేదికలలోనూ, వివిధ పరీక్షలలోనూ, మీడియా చర్చలలోనూ, ఉద్యోగార్థుల ఇంటర్వ్యూలలోనూ రోజూ అనేకానేక సమస్యలు ప్రస్తావనకు వస్తుంటాయి. ఇవి ఒక విషయానికే పరిమితమై వుండవు. పైగా ప్రతి సమస్యకూ ఒక నేపథ్యం వుంటుంది. ఒక సందర్భం వుంటుంది. దానంతటిని దృష్టిలోకి తీసుకోకపోతే విషయాన్ని సవ్యంగా అర్థం చేసుకోవడం కష్టం. ఒక్కో విషయానికి ఒక్కో పుస్తకం మరీ లోతుగా చదవడం కుదరదు. ఖర్చు అటూ ఇటూగా భరించగలమనుకున్నా అన్నిటికీ సంబంధించిన పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయో చెప్పగలవారు అన్ని వేళలా అందరికీ అందుబాటులో వుండకపోవచ్చు. చెప్పినా ఆ పుస్తకాలు దొరుకుతాయనే భరోసా వుండదు. అందుకే ఆల్ ఇన్ వన్ వంటి సంకలనాలు చాలా అవసరమవుతుంటాయి.

ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన 'సమగ్ర వ్యాసావళి' అక్షరాలా అలాంటి పుస్తకం. సామాజిక రంగం, రాజకీయ సమస్యలు, శాస్త్ర విజ్ఞానం, ఆర్థిక రంగం, ప్రపంచీకరణ, చరిత్ర విభాగాలకు సంబంధించిన వ్యాసాలు ఇందులో పొందుపర్చి వున్నాయి. 350 పేజీల ఈ పుస్తకాన్ని గ్రూపు పరీక్షలను పురస్కరించుకుని ప్రచురించారు. మారిన పోటీ పరీక్షల సిలబస్‌లో వివిధ సామాజిక సమస్యలకు ప్రాధాన్యత పెరిగినప్పటికీ అందుకు తగిన పుస్తకాలు అందుబాటులో లేనందున దీన్ని ప్రచురించినట్టు 'ముందు మాట' లో తెలిపారు. అలా అని ఈ పుస్తకం విద్యార్థులకే పరిమితమైంది కాదు. రాజకీయ కార్యకర్తలకూ, అన్ని రకాలైన అధ్యయనశాలులకూ వివిధ సందర్భాలకు దోహదపడేంత విస్తృత స్వభావం కలిగింది.

పుస్తకంలో అతి పెద్ద విభాగం సామాజిక సమస్యలు. 170 పేజీలుంది. ఈ విభాగంలో లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ, గాద్దు జగన్మోహన్, తెలకపల్లి రవి తదితరులు రాసిన వ్యాసాలు ఎక్కువగా వున్నాయి. సోమనాథ్ చటర్జీ ప్రధానంగా చట్టసభలకూ రాజ్యాంగ న్యాయవ్యవస్థలకూ సంబంధించిన సమస్యలు రాశారు. ఇక గాద్దు జగన్మోహన్ పరీక్షలలో తరచూ వచ్చే ఎయిడ్స్, బాల శ్రామికులు, మానవ హక్కులు, నిరుద్యోగ సమస్య వంటివి రాశారు. విద్యారంగం, మీడియాలకు సంబంధించిన అంశాలు తెలకపల్లి రవి అందించారు. ఆయనే ప్రపంచీకరణ ప్రభావాల పైన పెద్ద వ్యాసం రాశారు. టెర్రరిజం, మారణాయుధాలు, నేర సామ్రాజ్యం, తదితర అంశాలు కూడా ఈ విభాగంలో వున్నాయి.

ఆ పైన ఆర్థిక రంగంపై గుడిపూడి విజయరావు రాసిన పలు వ్యాసాలు లభిస్తాయి. ఇవన్నీ ఇప్పుడు అమితంగా చర్చలో వున్నవే కావడం విశేషం. సెజ్‌లు, ఆహార అభద్రత, అధిక ధరలు, వ్యవసాయ రంగంలో పేటెంట్లు, ఎఫ్‌డిఐ విధానాలు వగైరా అంశాలపై ఆయన సాధికారిక ప్రామాణిక సమాచారం అందించడంలో కృతకృత్యులయ్యారు. ఇంకా జయతీ ఘోష్, ఎంఎస్ స్వామినాథన్, ప్రభాత్ పట్నాయక్‌లు రాసిన వ్యాసాలూ ఈ భాగంలో వున్నాయి. ఇవన్నీ కొద్దిలోనే ఆర్థిక రంగాన్ని గురించి గొప్ప అవగాహన కలిగిస్తాయి. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌పై కూడా వ్యాసం వుంది. మామూలుగా కొంచెం ఇబ్బందిగా అనిపించే ఆర్థిక వ్యాసాలు సరళంగా సుబోధకంగా పత్రికా భాషలో వుండటం వల్ల ఆసక్తి కలిగిస్తాయి.

తర్వాతి విభాగం సైన్స్. ఇందులో కాకర్లమూడి విజయ్, ఎస్.వెంకట్రావ్, దేవరాజు మహారాజు, ప్రొ.ఎ.రామచంద్రయ్య రాసిన వ్యాసాలున్నాయి. ఇవన్నీ అవసరమైనవే గాక ఆకట్టుకునే రీతిలో వున్నాయి. 'అందరికీ సైన్స్ ఫలాలు' అన్న రామచంద్రయ్య వ్యాసం శాస్త్ర విజ్ఞానం పట్ల వుండవలసిన మౌలిక స్ఫూర్తిని తెల్పుతుంది. 'కొత్తవి కనిపెడుతూనే వున్నాం' అన్న కాకర్లమూడి విజయ్ వ్యాసం లో వివిధ రంగాలలో కొత్తగా ఆవిష్కరించుకున్న ఉపయోగకర వస్తుజాలం విశేషాలు తెలియజేశారు..(అయితే భారతీయులు ప్రాథమిక పరిశోధనల్లో కొంత వెనకపట్టు

పట్టానే అభిప్రాయం బలంగానే వుంది). 'అంతరిక్ష పరిశోధనలో అరశతాబ్ది ప్రగతి' అనే వెంకట్రావ్ వ్యాసం ఇప్పుడు పది ఉపగ్రహాలు ప్రయోగించిన ఇస్రో ప్రస్థానంపై వెలుగు ప్రసరిస్తుంది. దేవరాజు మహారాజు 'శీతల పానీయాలనబడేవి పురుగుమందులేనని' శీర్షికలోనే తెలియజేశారు. ఈ వైజ్ఞానిక విభాగం పుస్తకం విలువను పెంచింది.

చివరిది-చరిత్ర. గతంలేని వర్తమానం వుండదు. అంతేగాక పరీక్షలలో చరిత్ర పరిణామాల గురించిన ప్రశ్నలు తప్పనిసరి. మామూలు సభావేదికల్లోనూ గత చరిత్ర క్రమాన్ని ప్రస్తావిస్తే తప్ప మన వాదనను వివరించలేని సందర్భాలుంటాయి.

ఈ భాగంలోని నాలుగు వ్యాసాలు దేశ రాష్ట్ర పరిణామాల పూర్వాపరాలను విశ్లేషణాత్మకంగా చెప్పేందుకు ప్రయత్నించాయి. 'తెలుగు ప్రజల చారిత్రిక పోరాటాలు, ఉద్యమాలు' అన్న వ్యాసంలో సీనియర్ పాత్రికేయుడు వాసిరెడ్డి సత్యనారాయణ గత శతాబ్దిలో తెలుగు నాట సాగిన కొన్ని ప్రధాన ఉద్యమాలను సంక్షిప్తంగా వివరించారు. స్వాతంత్ర్య పోరాట ఘట్టాలతో పాటు కమ్యూనిస్టుల నాయకత్వంలో నడిచిన వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం,తర్వాత కాలంలో బంజరు పంపకానికై సాగిన పోరాటం, శిస్తు తగ్గింపు వుద్యమం, ఆ తర్వాత విశాఖ ఉక్కు పోరాటం, హిందీ వ్యతిరేక ఉద్యమం, అఖిల పక్ష రైతు వుద్యమం వగైరాలను గురించి పేర్కొన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్ర సాధనకై జరిగిన పోరాటాన్ని కూడా వివరించారు. ఆయన పేర్కొన్న వాటిలో కొన్ని ప్రసిద్ధమైనవే గాని అంతగా తెలియని వాటిని కూడా ప్రస్తావించడం యువ పాఠకుల అవగాహన పెంచుతుంది. 'వందేమాతరంలో చారిత్రిక కోణాలు' అన్న సవ్యసాచి ముఖర్జీ వ్యాసం ఈ గీతంపై సంఘ పరివార్ అనవసరంగా సృష్టిస్తున్న రభస వెనక రాజకీయాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. తెలకపల్లి రవి '20 శతాబ్దంలో వచ్చిన మలుపులు, భారత దేశంలో సామాజిక పరివర్తన' అన్న రెండు వ్యాసాలు వివిధ చారిత్రికాంశాల మధ్య లింకును తెలియజేస్తాయి.

మొత్తంపైన ఈ సంపుటిలోని వ్యాస వైవిధ్యం జిజ్ఞాసులందరినీ అకర్షిస్తుంది. అంతకంటే కూడా వారి అధ్యయనాకాంక్ష పెంచి అన్నిటినీ అన్వేషించుకునే అవసరం తగ్గిస్తుంది. వరుసగా ప్రకటించబడుతున్న పోటీ పరీక్షలకు మాట్లాడని నేస్తంగా మార్గదర్శకమవుతుంది.

సమగ్ర వ్యాసావళి
సామాజిక రంగం-రాజకీయ
సమస్యలు-శాస్త్ర విజ్ఞానం
ఆర్థిక రంగం-ప్రపంచీకరణ-చరిత్ర
వెల:130/-, పేజీలు:344
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2.
చిక్కడపల్లి, హైదరాబాద్
అన్ని బ్రాంచీలు.









సీరియల్

అమెరికన్ డేగ

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

జనరల్ హోవర్డ్

జరిగినకథ

ఇద్దరు జైలు అధికారుల మధ్య నడుస్తున్నప్పుడు క్రేజీహార్స్ తన 'వాస్తవ' ప్రపంచంలోకి జారుకున్నట్టుగా కలలు కనేవుంటాడు. నీడ లాంటి ఈ పిచ్చి ప్రపంచం తనను కబళించకుండా జాగ్రత్తపడాలి. దారిలో భుజం మీద రైఫిల్ పెట్టుకున్న గార్డు ఒకడు కనిపించాడు. ఎదురుగా తెరచిన ఒక బిల్డింగు కిటికీ తలుపులకు చువ్వలున్నాయి. బిల్డింగ్ లోపల కాళ్లకూ, చేతులకూ ఇనుప సంకెళ్లతో మనుషులు. జంతువులను ఇలా కట్టి పడేస్తారు. తనకు కూడా ఈ శిక్ష వేస్తారా? తను జంతువా? ఒక్కసారి లంఘించాడు. లిటిల్ బిగ్‌మూన్ అతడి భుజం పట్టుకొని ఆపటానికి ప్రయత్నించాడు. కొద్ది సెకండ్ల పాటు పెనుగులాట జరిగింది. గార్డ్ కమాండర్ పెద్దగా అరిచాడు.

(51వ భాగం)

సెంట్రీ తన బాయ్‌నెట్‌తో క్రేజీహార్స్ పొట్టలో పొడిచాడు. ఆ రాత్రే, అంటే 1877,సెప్టెంబర్ 5 నాడు క్రేజీహార్స్ మరణించాడు. ఆనాటికతడికి ముప్పై అయిదేళ్ళు నిండాయి. తెల్లవారి వుదయం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు అధికారులు. శవపేటికను మూడు గుర్రాల బండికి కట్టి స్పాటెడ్ టెయిల్ ఏజెన్సీకి తీసుకెళ్ళారు. అక్కడ ఒక వేదిక మీద సందర్శనార్థం వుంచితే క్రేజీహార్స్‌ను "డ్రైయింగ్ గ్రాస్ మూన్" రుతువంతా అభిమానులు, అనుచరులు నిత్యం దర్శించారు. అదే వాళ్ళ శ్రద్ధాంజలి. రుతువు మారింది. 'మూన్ ఆఫ్ ఫాలింగ్ లీవ్స్ పిడుగులాంటి వార్త తీసుకొచ్చింది. సియోలందరూ తక్షణం ఈ రిజర్వేషన్ ఖాళీ చేసి (నెబ్రాస్కా వదిలి) మిస్సోరీ రివర్ వద్ద వున్న కొత్త రిజర్వేషన్‌కు వెళ్ళిపోవాలి.

1877 ఆకురాలు కాలంలో చలిగాలి శరీరాల మీద గాట్లు పెడుతున్నది. ఇరువైపులా, గుర్రాల మీద సైనికుల పహారాలో, సంకెళ్లలో వందలాది ఇండియన్లు బారులు కట్టి కొత్త ఆవాసానికి నడిచారు. దారిలో కొందరు, సైన్యం కళ్లు కప్పి వుత్తరదిశగా కెనడాకు పారిపోయి సిట్టింగ్‌బుల్ ఏజెన్సీ చేరుకున్నారు. కొడుకు గుండెకాయా, అస్తికలూ పదిలంగా భద్రపరుచుకున్న క్రేజీహార్స్ తల్లి కూడా వాళ్లలో ఒకతి. ఎవరికీ తెలియని రహస్య ప్రదేశంలో వాటిని ఖననం చేశారు. ఆ సమాధి స్థలానికి ఇండియన్లు పెట్టిన పేరు "చంక్పె ఓపి వాక్పలా" అంటే "ఊండెడ్ నీ".

❋ ❋ ❋

తెల్లవాళ్ళు, తాము చేసిందంతా న్యాయమేనని లోకాన్ని నమ్మించారు.

వాళ్లంతా మంచి వాళ్లూ కారు. మేమంతా చెడ్డవాళ్లమూ కాము.

నెజ్ పెర్స్ తెగకు చెందిన ఎల్లో వూల్ఫ్

సూర్యుడి సాయంతో ఏర్పడిందీ భూమి. దీని రూపు రేఖలు మార్చే హక్కు అధికారం ఎవరికీ లేవు. సరిహద్దు లేని ఈ నేలమీద ఎవరూ గీతలు గీయవద్దు. తెల్లవాళ్ల స్వార్థానికి హద్దులేకుండా పోతున్నది. సారవంతమైన నేల వాళ్ల అధీనంలో పెట్టుకొని, బీడు భూముల్ని మాకిచ్చారు. దేవుని ఆజ్ఞతో ఆయన పంపిస్తేనే వచ్చామని చెప్పుకుంటున్నారు వీళ్ళు. మమ్మల్ని ఇలా నాశనం చెయ్యమని కూడా ఆదేశించాడా దేవుడు? నా మాటల్ని తప్పుగా అర్థం చేసుకోకండి. ఈ నేలంతా మాదేనని చెప్పటం లేదు. అందరూ వచ్చి వుండొచ్చు. దీన్ని సృష్టించడానికి మాత్రమే మార్చే హక్కుంటుంది. మీ భాగంలో మీరు బతకండి. మా చోట మమ్మల్ని బతకనివ్వండి.

నెజ్‌పెర్స్ నాయకుడు హైన్‌మాట్ టూయలాకెట్ (ఛీఫ్ జోసెఫ్)

1805 సెప్టెంబర్‌లో రాకీ పర్వతాలు దాటి పశ్చిమంగా పయనించిన లూయి, క్లార్క్ సైనికులు ఆహారం దొరక్క ఆకలితో అలమటించారు. ఆరోగ్యం పాడైంది. విరేచనాలు పట్టుకున్నాయి. ఈ పరిస్థితిలో ఆత్మరక్షణ సాధ్యం కాదు. అదృష్టవశాత్తూ అప్పుడు వాళ్లు నెజ్ పెర్స్ తెగల నివాస ప్రాంతంలో వున్నారు.

డెంటాలియం షెల్స్ (దంతాల్లాంటి ఆల్చిప్పలు) ముక్కుపుడకలుగా, ధరించే ఇండియన్లకు ఫ్రెంచి వాళ్ళు పెట్టిన పేరు నెజ్ (ముక్కు పెర్స్). నెజ్ పెర్స్ తలచుకుంటే లూయీ, క్లార్కుల సైనికుల్ని మట్టుబెట్టి గుర్రాల్నీ, ఆయుధాల్నీ స్వాధీనం చేసుకొని క్లియర్‌వాటర్ రివర్ వద్దే తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోగలిగే వాళ్లు. కాని నెజ్‌పెర్స్, తమమీద దాడికి వచ్చిన అమెరికన్లను సాదరంగా ఆహ్వానించారు. భోజనం పెట్టి, గుర్రాలకు దాణా వేసి నెలల తరబడి తమ అతిథులుగా వాళ్లకు సపర్యలు చేశారు. అమెరికన్లకూ, నెజ్‌పెర్స్‌కూ మధ్య స్నేహబంధం ఏర్పడటానికి దారి తీసిన ముఖ్యమైన సంఘటన అది. డెబ్బై ఏళ్లుగా, నెజ్‌పెర్స్ చేతుల్లో ఒక్క అమెరికన్ కూడా మరణించలేదని గర్వంగా చెప్పుకున్నారు వాళ్ళు. కాని, తెల్లవాళ్ల దురాశ, దుష్టబుద్ధీ ఈ బంధాన్ని తెంచివేసింది.

1855లో వాషింగ్టన్ టెరిటరీకి గవర్నర్‌గా వున్న ఐజాక్ స్టీవెన్స్ శాంతి చర్చలు నిర్వహించటానికి నెజ్‌పెర్స్‌ను ఆహ్వానించాడు. "ఈ దేశంలో తెల్లవాళ్ల జనాభా, గణనీయంగా పెరిగింది. మరికొన్ని వేల మంది రాబోతున్నారు. అందువల్ల మనం సరిహద్దులు ఏర్పాటు చేసుకొని ఎవరి ప్రాంతాల్లో వాళ్ళు వుండటమే శ్రేయస్కరం" అది అతని ప్రతిపాదన.

గవర్నర్ మాటలకు నిర్ఘాంత పోయారు ఇండియన్లు. "ఈ భూమి మాది మాత్రమే అనే

నైట్‌బర్డ్

వాలోవా వాలీ జోసెఫ్ అనుచరులదే అని ప్రకటించిన రెండేళ్లకే, అక్కడ తెల్లవాళ్లకు కూడా ప్రవేశముంటుందని ప్రకటించింది ప్రభుత్వం. మరి కొన్నాళ్లకు, నెజ్‌పెర్స్ అక్కడి నుండి లాప్వామ్ రిజర్వేషన్‌కు వెళ్లటానికి గడువు విధించింది. తన పూర్వీకులు 'వాలోవా'ను వదలటానికి నిరాకరించాడు జోసెఫ్. కాని 1877లో వన్ ఆర్మ్‌డ్ సోల్జర్ చీఫ్ జనరల్ హోవార్డ్ తన సైన్యాలతో వచ్చి నెజ్‌పెర్స్ ఆ ప్రాంతాన్ని తక్షణం ఖాళీ చెయ్యాలని ఆదేశించాడు.

హక్కు ఎవరికీ లేదు. మనుషులందరూ కలిసి బతకాలని దేవుడు నిర్ణయించాడు" అన్నాడు ట్యూకాకాస్ (తెల్లవాళ్లు ఇతడికి పెట్టిన పేరు ఓల్డ్ జోసెఫ్).

నెజ్‌పెర్స్ ఇంత మూర్ఖంగా మాట్లాడగలరని వూహించలేదు గవర్నర్. కాని సరిహద్దులకు చట్టబద్ధత కల్పించాలంటే వీళ్ల అంగీకారం తప్పనిసరి. సంధి పత్రాల మీద సంతకాలు పెట్టమని ఒత్తిడి చేశారు. బ్లాంకెట్లు, బహుమతులు ఇస్తానని ప్రలోభపెట్టాడు. కాని కాగితాలను ముట్టుకోవడానికి కూడా వాళ్ళు నిరాకరించారు.

అలెయా (తెల్లవాళ్ల రికార్డుల్లో ఇతడి పేరు 'లాయర్') మరి కొందరు నెజ్‌పెర్స్ కానుకలు తీసుకొని ఒప్పందంలోని షరతులన్నీ అంగీకరించారు. జోసెఫ్‌కు తెల్లవాళ్ల కుట్రల మీద వెగటుపుట్టి తన మనుషులతో వాలోవా వాలీ వైపు తరలిపోయాడు. సెలయేళ్ళు, పచ్చిక మైదానాలు, పర్వతాలు, స్వచ్ఛమైన నీటి కొలనులున్న ప్రాంతమది. గుర్రాలనూ,పశువులనూ పెంచుకొంటూ కలపతో ఇళ్లు కట్టుకొని ప్రశాంత జీవితం కొనసాగించారు నెజ్‌పెర్స్. ఏదైనా అవసరం పడినప్పుడు వస్తుమార్పిడి ద్వారా సమకూర్చుకున్నారు.

"సంధి కుదుర్చుకుని రెండేళ్లైనా గడవకముందే, ప్రభుత్వం దళాలు నెజ్‌ఫెర్స్ కోసం గాలింపు ప్రారంభించాయి. తెల్లవాళ్ల సంఖ్య పెరిగింది. మరింత భూమి కావాలి. "కానుకలు స్వీకరించి వాళ్ళ వుచ్చులో పడకండి. బ్లాంకెట్లు కూడా తీసుకోవద్దు" అంటూ వారించాడు జోసెఫ్. "వాళ్ళ ప్రకారం అవి బహుమతులు కావు. మన నివాస ప్రాంతం ఆక్రమించుకోవటానికి వాళ్ళు చెల్లిస్తున్న ధర".

1863లో నెజ్‌పెర్స్ తమతో మరో సంధి చేసుకోవాలనుకున్నారు తెల్లవాళ్ళు. దాని ప్రకారం వారంతా ప్రస్తుతమున్టున్న వాలోవా వాలీ ప్రాంతంలో నాల్గింట మూడు వంతులు వాళ్ళ అధీనంలోకి పోతుంది. అంటే ఇక మీదట ఐడహోలోని ఒక రిజర్వేషన్‌కు మాత్రమే నెజ్‌పెర్స్ పరిమితం కావాలన్నమాట. జోసెఫ్ నిరాకరిస్తేనేం- లాయర్, మిగతా నాయకులూ స్వచ్ఛందంగా తమ మాతృభూమిని పరాధీనం చేశారు. ప్రకృతి అందాలకు ఆలవాలమైన వాలీ ఆఫ్ వైండింగ్ వాటర్స్ వాళ్లను ఆకట్టుకోలేకపోయింది.

దీన్ని "దొంగల మధ్య కుదిరిన ఒప్పందం" అన్నాడు జోసెఫ్. తెల్లవాళ్లంటేనే ఏవగింపు పెరిగిన ఈ వృద్ధ నాయకుడు, ఒక మత ప్రచారకుడు తనను క్రైస్తవమతంలోకి మారమని బహుమతిగా పవిత్ర గ్రంథం 'బైబిల్'ను చించి మొహానకొట్టాడు. తనకు ప్రాణప్రదమైన వాయివా వాలీని రక్షించుకోవటానికి వృథాప్రయత్నమని తెలిసినా సరిహద్దులో కర్రలు పాతి స్వతంత్రం ప్రకటించుకున్నాడు.

అయితే ఆ తర్వాత కొద్ది కాలానికే, 1871లో (ఓల్డ్) జోసెఫ్ మరణించాడు. అతని అనుచరుడు హైన్‌మాట్ టూయలాకెట్ (యంగ్ జోసోఫ్)ను నాయకునిగా ప్రకటించాడు. అప్పటికతడికి ముప్పై ఏళ్లు. జోసెఫ్, నాయకత్వ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే నెజ్‌పెర్స్ తెగవాళ్లంతా వాలోవా వాలీ వదిలి లాప్వే రిజర్వేషన్‌కు తరలి పోవాలని ఆదేశించింది ప్రభుత్వం. ఇది తొలి పరీక్ష. "లాయర్" లాంటి కిరాయి ముఠానాయకులతో మమ్మల్ని లొంగతీసుకోలేదు. ఇది మా నేల. చివరి నెత్తుటి బొట్టుదాకా మా జన్మభూమి కోసం పోరాడతాం" అంటూ ప్రకటించాడు మాంగ్ జోసెఫ్. కింది స్థాయి వుద్యోగులెవరో సంధి షరతుల్ని అతిక్రమిస్తున్నారని గ్రేట్ ఫాదర్ యులిసిస్ గ్రాంట్"కు తమ పరిస్థితి విన్నవించుకున్నాడు. ప్రయత్నం ఫలించింది. వాలోవా వాలీ నుండి ప్రభుత్వ దళాలను విరమించుకుంటున్నట్టుగా, జూన్ 16, 1873 నాడు ప్రెసిడెంట్ పేర ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ విడుదలైంది.

అయితే ఈ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. త్వరలోనే కమిషనర్లు వచ్చి వాలీలో 'ఇండియన్ ఏజెన్సీ' ఏర్పాటు చెయ్యటానికి మంతనాలు ప్రారంభించారు. అక్కడ స్కూళ్లు ఏర్పాటు చేసి అందరికీ చదువు నేర్పాలని కూడా ప్రభుత్వం ఒక ప్రణాళిక సిద్ధం చేసింది.

"మాకు తెల్లవాళ్ల స్కూళ్ళు అక్కర్లేదు" అంటూ ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు జోసెఫ్.

"స్కూళ్లకు కూడా అభ్యంతరమా?" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు కమిషనర్.

"చర్చల గురించి మేం తెలుసుకోదలచటం లేదు".

"చర్చల వల్ల నష్టమేమిటి!"

"మాకు వద్దు... అంతే అక్కడ దేవుడి గురుంచి కాక మనుషులు కలహించుకుంటారు. మాలో మేం రోజువారీ సమస్యల గురించి పోట్లాడుకుంటాం గాని దేవుడి గురించి చర్చించం."

వాదప్రతివాదన ఎలా వున్నా, నెజ్‌పెర్స్ ప్రాంతం మీద తెల్ల సెటర్ల కన్ను పడింది. ఎలాగైనా ఆ భూమి కాజెయ్యాల్సిందే. ఇక్కడి పర్వతాల్లో బంగారం నిక్షిప్తమై వుందని వార్తలు వ్యాపిస్తున్నాయి. తెల్లవాళ్లలో అసహనం పెరిగింది. దొంగతనం కాదు, బహిరంగ దోపిడీకే ఎగబడ్డారు. ఇండియన్ల, గుర్రాలు, పశువుల మందల్ని బలవంతంగా లాక్కున్నారు. ఈ 'ఆటవికులు', నాగరిక సమాజానికి శత్రువులని వాషింగ్టన్లకు తప్పుడు నివేదికలు పంపించారు. "ఇండియన్ల వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తున్నాయి. ఎలాగైనా వీళ్లను లొంగదీసుకోవాలి. లేదా నిర్మూలించాలి". ఈ నివేదికలు పచ్చి అబద్ధమని జోసెఫ్‌కు తెలుసు.

"మా దేశంలో మాకు మిత్రులు కరువయ్యారు. వాషింగ్టన్‌లోని గ్రేట్ ఫాదర్ మా సమస్యల్ని అర్థం చేసుకోడు'' అంటూ వాపోయాడు.

వాలోవా వాలీ జోసెఫ్ అనుచరులదే అని ప్రకటించిన రెండేళ్లకే, అక్కడ తెల్లవాళ్లకు కూడా ప్రవేశముంటుందని ప్రకటించింది ప్రభుత్వం. మరి కొన్నాళ్లకు, నెజ్‌పెర్స్ అక్కడి నుండి లాప్వామ్ రిజర్వేషన్‌కు వెళ్లటానికి గడువు విధించింది. తన పూర్వీకులు 'వాలోవా'ను వదలటానికి నిరాకరించాడు జోసెఫ్. కాని 1877లో వన్ ఆర్మ్‌డ్ సోల్జర్ చీఫ్ జనరల్ హోవర్డ్ తన సైన్యాలతో వచ్చి నెజ్‌పెర్స్ ఆ ప్రాంతాన్ని తక్షణం ఖాళీ చెయ్యాలని ఆదేశించాడు.

ఈ అలివల్ ఓటిస్ హోవర్డ్ కాచైస్‌నూ, ఇతర అపాచీలనూ అదుపుచేసి అప్పటికి నాలుగేళ్లైంది. ఇండియన్ల పట్ల సానుభూతి చూపించే తెల్లవాళ్లను, అధికారులిష్టపడరని అనుభవపూర్వకంగా గ్రహించాడు. కనీసం ఇప్పుడైనా పైవాళ్లను మెప్పించాలి. 'నెజ్‌పెర్స్' ను అక్కడి నుండి తరిమెయ్యటం అన్యాయమని ప్రైవేటుగా అంగీకరించి నప్పటికీ, మనసు చంపుకుని ప్రభుత్వ ఆజ్ఞలు అమలు చెయ్యటానికే నిశ్చయించు కున్నాడు. 1877 మే నెలలో జోసెఫ్‌తో లాప్వా వద్ద సమావేశం జరిపి రిజర్వేషన్ కెళ్ళే తేదీ ఖరారు చెయ్యమని కోరాడు.

ఇంకా వుంది....

డబ్బుందన్న గర్వం పోయింది



వైవిధ్యభరిత పాత్రలు పోషించాలన్న తలంపు కొద్దిమంది యువ నటీనటులకు మాత్రమే ఉంటుంది. అలాంటి వారిలో శర్వానంద్ ఒకరు. 'గమ్యం' చిత్రంలో అభిరామ్‌గా అందరినీ ఆకట్టుకున్నాడు. సినిమా ఇండస్ట్రీలో నిలబడాలంటే బ్యాక్‌గ్రౌండ్ ఉండాలంటారు. పైకి తీసుకొచ్చే గాడ్‌ఫాదర్స్ అవసరం ఎంతైనా ఉండాలంటారు. కానీ శర్వానంద్ ఎలాంటి వెన్నుదన్ను లేకుండా తన ప్రతిభను నమ్ముకుని ముందుకు సాగుతున్నాడు. 'నా జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు మోటుగా, మర్యాద లేకుండా ప్రవర్తించేవాణ్ణి. బాగా డబ్బుందన్న గర్వంతో ఉండేవాణ్ణి. ఇంటర్మీడియట్ తర్వాత నా వైఖరిలో మార్పు వచ్చింది. ఎవరిపైనా ఆధారపడకుండా నటుడిగా స్థిరపడడానికి ఎన్నో కష్టాలు పడ్డాను. ఈ గమనంలో ఎంతో నేర్చుకున్నాను. ఏదైనా మనం మనుష్యులం అన్న సంగతి మర్చిపోకూడదు' అంటున్న ఈ యువ నటుడితో కాసేపు...

సినిమాల్లో నటిద్దామన్న ఆలోచన ఎప్పుడొచ్చింది?

18 ఏళ్ళ వయసులో నటిద్దామన్న ఆలోచన మెదిలింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసి, నటనలో శిక్షణ పొందడానికి ముంబాయి వెళ్ళాను. అనంతరం వేషాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగాను. యాక్టర్ కావాలన్న కల రెండేళ్ళ క్రితం నెరవేరింది.

ఇండస్ట్రీలో తెలిసిన వాళ్ళు, గాడ్ ఫాదర్ అంటూ ఎవరైనా ఉన్నారా?

ఈ ఫీల్డ్‌లోకి వచ్చినప్పుడు నాకంటూ ఎవరూ లేరు. స్వశక్తిని నమ్ముకుంటూ వచ్చాను. ఈరోజు గతంలోకి తొంగి చూస్తే... సహాయం అందించడానికి ఎవరూ రాని ఆనాటి పరిస్థితి గుర్తుకొస్తుంది. నేడు చేయూత ఇవ్వడానికి అనేక మంది ఉన్నారు. ఆ రోజుల్లో నేను పడ్డ కష్టం గురించి ఇప్పుడు మాట్లాడడం భావ్యం కాదు. 'డిసెంబర్ 5' చిత్రం ద్వారా పరిచయమయ్యాను. కెరీర్‌పరంగా ఈ రెండేళ్ళలో అనేక విషయాలు తెలుసుకున్నాను. ప్రతి మనిషికీ ఎప్పుడోకప్పుడు విజయం వరిస్తుంది. కానీ మనిషి నైజంలో మార్పు రాకూడదు. మానవత్వమే ప్రధానమని నమ్ముతాను.

యువ నటీనటులు, నూతన నటీనటులను ఇండస్ట్రీ ఎలా ట్రీట్ చేస్తోంది?

ఇతరుల గురించి చెప్పను కానీ, నాకైతే సహ నటీనటుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోంది. కెరీర్ మొదట్లో అందరిలాగే చేదు అనుభావాలు ఎదుర్కొన్నాను.

'జస్ట్ ఎల్లోరా'కు మంచి సంస్థగా గుర్తింపు ఉంది. కానీ ఇదే బేనర్‌లో వచ్చిన 'అమ్మ చెప్పింది' నిరాశపరిచింది. తప్పు ఎక్కడ జరిగిందని భావిస్తారు?

హిట్ అవుతుందన్న భావనతోనే ఎవరైనా సినిమా తీస్తారు. కానీ మా తల రాత ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. చాలా మంచి చిత్రాలు సక్సెస్ కాని దాఖలాలున్నాయి. ఎందుకంటే... చెప్పలేం! సినిమా హిట్/ఫట్ కావడానికి సరైన కారణం ఎవ్వరూ చెప్పలేరు. నేడు 'గమ్యం' ఆదరణ చూరగుంటోంది. కానీ ఈ రోజు వరకూ 'అమ్మ చెప్పింది' చిత్రాన్నే నేను ఎక్కువ ఇష్టపడతాను. ఆ సినిమా ఆడకపోయినా, నా నటన మెచ్చుకుంటూ రివ్యూలు రాశారు. బాగా చేశావంటూ అందరూ అభినందించారు.

'గమ్యం'లో అభిరామ్‌గా నటించారు. నరేష్ పోషించిన గాలి శ్రీను పాత్ర, అభిరామ్ పాత్రల్లో ఏది కావాలని, మీ ఛాయిస్‌కు వదిలేస్తే...

ముందుగా గాలి శ్రీను పాత్ర వస్తే తప్పకుండా నటించేవాణ్ణి. నటుడనేవాడు ఏ పాత్రనైనా ఛాలెంజ్‌గా తీసుకుని మంచి పెర్‌ఫార్మెన్స్ ఇవ్వాల్సివుంటుంది. గాలి శ్రీను పాత్రలో నరేష్ నటిస్తున్నాడని తెలిసి చాలా సంతోషించాను. ఎందుకంటే ఆ పాత్రకు అతనే కరెక్ట్. ఒకవేళ ఆ పాత్ర నేనే చేయాల్సి వస్తే... అతనంత బాగా చేయలేనేమో! నా జనరేషన్ హీరోలు చాలా మంది గాలి శ్రీను పాత్ర చేయడానికి ఇష్టపడరు. కానీ నరేష్ ఇందుకు మినహాయింపు. ఏ పాత్రనైనా ఛాలెంజ్‌గా తీసుకుని నటించే నాలాంటి వాళ్ళు చాలా తక్కువ మంది ఉన్నారు. మేమందరం హీరోలుగా స్థిరపడాలనుకుంటాం. అలాగే... అరుదుగా వచ్చే ఇలాంటి పాత్రలూ సమాంతరంగా చేయాలి.

ఇప్పటి వరకూ 11 చిత్రాల్లో నటించారు. మీ కెరీర్ గ్రాఫ్ చూస్తే ఏమనిపిస్తుంది?

నటుడిగా ఒక్కో మెట్టు ఎక్కుతున్నాను. నటన సముద్రం లాంటిది. ఇందులో అనేక పాత్రలుంటాయి. ఫలానా క్యారెక్టర్ వస్తే బాగుంటుందని ప్రతి ఒక్కరూ ఆశ పడతారు. చివరికి మనకు దక్కిన పాత్రకు న్యాయం చేయడమే ముఖ్యం. ఇప్పటివరకైతే పెద్ద హిట్ వచ్చి ఒక్కసారిగా పేరొచ్చిన సందర్భం లేదు. ప్రేక్షకుల మదిలో ఇప్పుడిప్పుడే స్థానం సంపాదించుకుంటున్నాను. అలాగే జనాలు కూడా నా సినిమాలు చూడడం మొదలుపెట్టారు.

నటుడిగా మీ లక్ష్యం?

లక్ష్యం చేరామనుకుంటే... ఇంక పొందడానికి ఏమీ ఉండదు. అదే ఇంకా లక్ష్యంకు రీచ్ కాలేదనుకుంటే... ప్రోత్సాహంగా ముందుకెళ్తాం. ఈ ప్రొఫెషన్లో సంతృప్తి ఉండదు.

కెరీర్‌పరంగా కాకుండా జీవితం గురించి మీ వైఖరి?

నా జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు మోటుగా, మర్యాద లేకుండా ప్రవర్తించేవాణ్ణి. బాగా డబ్బుందన్న గర్వంతో ఉండేవాణ్ణి. ఇంటర్మీడియట్ తర్వాత నా వైఖరిలో మార్పు వచ్చింది. ఎవరిపైనా ఆధారపడకుండా నటుడిగా స్థిరపడడానికి ఎన్నో కష్టాలు పడ్డాను. ఈ గమనంలో ఎంతో నేర్చుకున్నాను. ఏదైనా మనం మనుష్యులం అన్న సంగతి మర్చిపోకూడదు. ఒకరి గురించి ఇంకొకరు పట్టించుకోరు. ఒకవేళ మీకు మంచి మనస్తత్వం ఉంటే గౌరవించబడతారు. ఇతరుల దృష్టిలో గుర్తింపు కోసం కాకుండా... మంచి వైఖరితో మెలగాలి. మంచి మనిషిగా ఉండడానికి ప్రయత్నిస్తూ, ఇతరులకు హాని తలపెట్టకుండా ఉంటే చాలు. జీవితంలో ఇంత కంటే చేయగలిగింది ఏదీ ఉండదు. ఈ సిద్ధాంతాన్ని నేను నమ్ముతున్నాను. ఆచరిస్తున్నాను.

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

మూడు భయాలు

నాకు విమానం ఎక్కాలన్నా, లిఫ్టులో వెళ్ళాలన్నా, గది బయట గడియ పెట్టినా భయమే. మిగిలిన విషయాల్లో బానే వుంటాను. ఇది తప్పా. దీనికి పరిష్కారం సూచించగలరు.

– మహిత, రాయదుర్గం.

అందరిలో రకరకాల భయాలు ఉండడం సహజం. ఆ భయాలు జీవితానికి ఇబ్బంది పెట్టనంతకాలం సమస్యగా పరిగణించాల్సిన పనిలేదు. మీరు ఎదుర్కొంటున్న భయాలను "క్లాస్ట్రో ఫోబియా" అంటారు. తప్పించుకోలేనన్న భయం పెరిగి పోవడం వల్ల "అటోనమిక్ నెర్వస్ సిస్టమ్" ఎక్కువగా ఉత్తేజితమవుతుంది. దీనితో ఊపిరి ఆడనట్లు గుండె దడ, ఆందోళన పెరిగిపోతాయి. గతంలో ఎదురైన అనుభవాల రీత్యా లేదా విన్నా చూసినా కూడా వాటి ప్రభావం మీ మీద ఉంటుంది. ఇలాంటి భయాలు మనసులో పెరిగి పోవడాన్ని "కండిషనింగ్" అంటారు. ఈ సమస్యను "డిసెన్సిటైజేషన్" ద్వారా అంటే ఊహల ద్వారా అటువంటి పరిస్థితి కల్పించి భయాలను తొలగిస్తారు. భయాలను మెల్లమెల్లగా తొలగించుకునే విధంగా సైకాలజిస్టులు మీకు శిక్షణ ఇస్తారు. ఆందోళన పెరిగినప్పుడు రిలాక్స్ అవడానికి కావల్సిన పద్ధతులను నేర్పిస్తారు. ఎన్.ఎల్.పి.లో "ఫాస్ట్ ఫోబియా" టెక్నిక్ ద్వారా సులభంగా పరిష్కరించవచ్చు. మీరు కౌన్సెలింగ్ సైకాలజిస్టులను కలవండి.

బావను ప్రేమిస్తే... పరువు తీసినట్టా!

నా వయస్సు 18 సంవత్సరాలు. మాది చాలా గౌరవప్రదమైన కుటుంబం. నేను మా బావను ప్రేమించాను. తను కూడా నన్ను ప్రేమిస్తున్నాడు. కాని మా నాన్నకి నన్ను ఆ అబ్బాయికిచ్చి పెళ్ళి చేయడం ఇష్టం లేదు. నేను పరువు తీస్తున్నానని వాళ్ళు చాలా బాధపడుతున్నారు. నాకు చదువుకోవాలని ఉంది. నేను ఏమి చేయాలో... నా సమస్యకు పరిష్కారం చెప్పండి. మీ సలహా కోసం ఎదురు చూస్తు ఉంటాను.

– షమ్మి, గుంటూరు.

తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు పాడు చెయ్యాలని చూడరు. వాళ్ళ అనుభవంలో అబ్బాయి మంచి వాడా కాదా అని ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. ప్రేమలో మీరు దారి తప్పకుండా ఉండేందుకు మిమ్మల్ని హెచ్చరిస్తున్నారు. వారి ఆందోళనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. వారితో ప్రేమగా మాట్లాడండి. వారు ఏమి అన్నా గొడవ పడకండి. ఎక్కువగా వారితో గడపండి. తల్లిదండ్రులతో ఫ్రీగా ఉండడం వల్ల వాళ్ళు నీ గురించి ఆలోచిస్తారు. ప్రైవేటుగా ఇంట్లోవుండి చదువుకోండి. మంచి

పుస్తకాలు చదవండి. కుట్లు, అల్లికలు నేర్చుకోండి. మీ బావ మంచిగా సెటిల్ అయితే కొంత కాలానికి మీ ఇద్దరికి పెళ్ళిచేయవచ్చు. ఓపికతో, సహనంతో వేచి వుండండి.

పరాయివాళ్లతో మాట్లాడితే అనుమానం

నా పేరు బ్రహ్మం. ఈ మధ్య నా భార్య ఎవరితో మాట్లాడినా సహించలేక పోతున్నాను. తను నాకే సొంతం. కాని ఎక్కడ దూరమైపోతుందో అని భయంగా వుంటుంది. సలహా ఇవ్వగలరు?

బ్రహ్మం, నిజామాబాద్.

'నా భార్య నాకే సొంతం' అనుకోవడంలో తప్పు లేదు. నా భార్య నాకే సొంతంగా, నా అధీనంలోనే ఉండాలి. తన సొంతమైన దాన్ని ఇతరులు ఏమాత్రం పంచుకోవాలని చూసినా సహించలేక పోవడాన్ని "పొసెసివ్‌నెస్" అంటారు. అత్త, కోడలిని తిట్టడం, తల్లికి కొడుకు పైనున్న పొసెసివ్ వల్లే జరుగుతుంది. అలాగే భార్య కూడా తన భర్త ఇంకో పరాయి వ్యక్తితో చనువుగా ఉన్నా భరించలేదు. ఇది భార్యకు భర్తపై ఉండే "పొసెసివ్‌నెస్". ఈ "పొసెసివ్‌నెస్"కి మూల కారణం ఒకరిపై ఒకరికున్న అమితమైన ప్రేమానురాగాలే! తన సొంతమనుకున్న వ్యక్తి తనకు దూరమౌతాడేమోనన్న "ఇన్‌సెక్యూరిటీ" ఫీలింగ్ (అభద్రతాభావం) కూడా! ఈ పాశ్చాత్య నాగరికతలో ఈ "పొసెసివ్‌నెస్". తక్కువే! ఇది ఒకస్థాయిలో ఉండడం మంచిది. విపరీతమైతే ఆ దంపతుల మధ్య మనస్పర్థలు, అపోహలు- అను మానాలు ఏర్పడే అవకాశముంది. చివరికి మానసిక అశాంతికి దారితీసి దంపతుల మధ్య పెద్ద అగాధం ఏర్పడుతుంది. మిమ్మల్ని మీరు అర్థం చేసుకుంటూ మీ భార్యను అర్థం చేసుకొని మెలగ గల్గితే మీ కుటుంబం ఆనందంగా ఉంటుంది. ప్రతి విషయాన్ని, పనిని తనతో పంచుకోండి. మీ ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా వుండేలా చూసుకోండి. ఎక్కడికెళ్ళినా ఇద్దరూ కలిసి వెళ్లండి. మీ భార్యపై నమ్మకాన్ని పెంచుకోండి. అప్పుడు మీలో పొసెసివ్‌నెస్ తగ్గుతుంది.



చిన్నారి చిత్రకారులు



సిహెచ్. అజయ్,
మధు
విద్యాలయం,
వైరా, ఖమ్మం

సిహెచ్. జీవన్ సురేష్,
యు.కె.జి,
జూలూరు పాడు,
ఖమ్మం .

టి. గాయత్రి,
మెయిన్ రోడ్,
జూలూరుపాడు,
ఖమ్మం.

ఎం. మధుకర్,
8వ తరగతి, గురుకుల పాఠశాల,
ఇబ్రహీంపట్నం.

బాలనేస్తం

గిలక్కాయ కావాలంటే...



సూదితో గుచ్చినా పగలని బూర



చూడండి. నేను గుచ్చుతాను' అంటూ... గుండు సూది తీసుకోండి. 'అ
అతికిస్తామో అక్కడ టేప్‌కి బూరకి మధ్యకి .... గుండు సూదిని పోని
మెల్లగా చేయాలని గుర్తుంచుకోండి. అందరూ అనుకుంటున్నట్లు బ
చప్పట్లు కొట్టేస్తారు. తమాషా బావుంది కదూ. మరైతే ఆలస్యం ఎంద

పేలాల చెట్టు

చేసేద్దాం

నేస్తాలూ! పేలాలు తినీ తినీ బోర్ కొట్టిందా! అయితే వాటితో ఒక చెట్టు చేద్దామా! మరీ అంతలా ఆశ్చర్యపోకండర్రా! పేలాల చెట్టు భలే బావుంటుంది. కావాలంటే ...ఈ బొమ్మలో చూడండి. నచ్చిందా! మరైతే మొదలెట్టేద్దాం.

ఏమేం కావాలంటే....

పేలాలు, ఒక ముళ్ల కొమ్మ, చిన్న గిన్నె.

ఎలా చేయాలంటే...

ముందుగా ముళ్లు వున్న చెట్టు నుంచి ఒక కొమ్మను తీసుకోండి. దాని ఆకులను తీసేయండి. ఇప్పుడు జాగ్రత్తగా ఒక్కో ముల్లుకు ఒక్కో పేలాం గుచ్చండి. ఇక్కడే చాలా జాగ్రత్తగా వుండాలని తెల్సుగా. లేకుంటే ముళ్లు చేతులకు గుచ్చుకుంటాయి. దీన్ని ఒక పక్కన నిలబెట్టండి. ఇప్పుడు ఏం చేస్తారంటే...చిన్న గిన్నెలో మట్టి తీసుకోండి. అందులో ఎంచక్కా పేలాల కొమ్మను గుచ్చండి. తెల్లటి పేలాల చెట్టు రెడీ అయినట్టే. మీకు ఇష్టమైతే పేలాలకు రంగులు కూడా వేయొచ్చు. దీన్ని ఎంచక్కా టేబుల్ మీదో, అద్దాల అల్మారాలోనో పెట్టొచ్చు. చూడ్డానికి చాలా బావుంటుంది. చేయడం సులభం కూడా. కొద్ది రోజులు పోయాక పేలాలకు వేసిన రంగు వెలిసిపోతుందికదా. అప్పుడు మళ్లీ వాటికి రంగులు వేయొచ్చు. లేదా ఫ్రెష్‌గా పేలాలు తీసుకొని రంగులు వేసి మళ్లీ గుచ్చొచ్చు. ఎలా వుంది ఐడియా. మరి చేసేయాలిగానీ...ఇంకా కూర్చుని చూస్తున్నారేంటీ...!

హాయ్ పిడుగులూ... మీరంతా ఇవాల్టికోసం ఎంతగానో ఎదురుచూస్తుంటారని మాకు తెలుసులే. ఇవాళ మీకోసం బోలెడన్ని తమాషాలు చెప్పాలనుకుంటున్నాం. అందులో ఇదిగో ఈ బూర ఒకటి. దీన్ని సూదితో గుచ్చినా పగలదు తెల్సా. 'ఆ... మేం అంత లాలిపప్పల్లా కనిపిస్తున్నామా! సూదితో గుచ్చినా పగలని బూర ఎక్కడైనా వుంటుందా?' అనుకుంటున్నారు చాలా మంది నేస్తాలు. కానీ ఈ బూర నిజంగానే పగలదు. కాకపోతే ఒక ట్రిక్కు వుంది. అన్నట్టు... మీరంతా ఇలా దగ్గరగా రండి. ఇది చాలా సీక్రెట్! మీరు మా చిన్నారులని మీకు మాత్రమే చెప్తున్నాం. ఓకేనా.

అసలు ఏమేం కావాలంటే...

ఒక బూర, స్కాచ్ టేప్, గుండు సూది, దారం.

ఎలా చేయాలంటే...

ముందుగా బూరను ఊది...చివరన దారంతో కట్టేయండి. ఇప్పుడు రెండు అంగుళాల స్కాచ్ టేప్ ముక్క తీసుకోండి. బూర మీద ఒక చోట అతికించండి. ఇప్పుడు మీ నేస్తాలను పిలవండి. అందరి ముందు బూరను గాలిలో ఊపుతూ..."ఈ బూర చాలా స్పెషల్ బూర. దీన్ని సూదితో గుచ్చినా పగలదు. కావాలంటే ...కదబ్ర...అబ్రకదబ్ర...' అంటూ మనం బూరమీద ఎక్కడైతే టేప్ ...ండి. ఇదంతా చాలా ...ర పగలదు. ఇంకేముంది మీ నేస్తాలంతా ఆశ్చర్యంతో చప్పట్లే ...ంట.. చేసి చూపించండి మీ నేస్తాలకు.

ఆవును ఇటు తిప్పండి

పిడుగులూ! ఇక్కడ అగ్గిపుల్లలతో చేసిన బుజ్జి ఆవు వుందికదా. అది ఎడమ చేతివైపు చూస్తోంది. కాకపోతే మీరు దాన్ని కుడి చేతి వైపు చూస్తున్నట్టు మార్చాలి. అందుకోసం రెండంటే రెండే అగ్గిపుల్లలను కదల్చొచ్చు. చాకులాంటి మీ బుర్రకు పదును పెట్టండి మరి. ఎంతకీ సమాధానం తెలీకపోతే మాత్రం మా జవాబు చూడండే!



జవాబు:

ఏంటి తెలీలేదా! మరీ ఇంత పప్పులనుకోలేదే మిమ్మల్ని. సరే మేమే చెప్పేస్తున్నాం. ముందు ఆవు బొమ్మను పరిశీలించండి. తల, కాళ్లు, కొమ్ములు, తోక, పొట్ట...కనిపిస్తున్నాయిగా. మొహం ఆకారంలో వున్న రెండు అగ్గిపుల్లలను పొట్ట లోపలికి త్రికోణాకారంలో అమర్చండి. అంతే. అటు చూస్తున్న ఆవు ...ఇటు చూస్తుంది. తమాషాగా వుందికదూ.



త్రిమూర్తులు, విశాఖ.
కిరణ్, మదనపల్లి.

ఆంధ్రా 'ఊటీ'లు

డబ్బున్న వారు వేసవిలో ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాలకు వెళతారు. డబ్బులేనివారు, మధ్యతరగతి కుటుంబాల వారు వేసవి విడిదిగా అరకు, భీమ్లీ, హార్స్‌లీహిల్స్‌ను ఎంచుకుంటారు. పిల్లలతో వెళ్లి కొంత సేద తీరతారు. చిత్తూరు జిల్లా మదనపల్లె ప్రాంతంలోని హార్స్‌లీహిల్స్ వేసవి కాలంలో పేదవాడికి సేదతీర్చే ప్రాంతంగా పేరుగాంచింది. దాంతో ప్రతి యేడాదీ ఇక్కడకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ కొండను పేదవాళ్ల ఊటీ లేదా ఆంధ్రా ఊటీ అనే పేర్లతో ఈ ప్రాంత ప్రజలు ముద్దుగా పిలుచుకుంటారు. ఇంక అరకు అందాల గురించి ప్రత్యేకంగా తెలియనిదేముంది?! వివరాలలోకి వెళితే ...

ప్రకృతి పారవశ్యంలో మునిగి తేలాలన్నా, అవధులు లేని ఆనందాన్ని సొంతం చేసుకోవాలన్నా ఒక్కసారి విశాఖ ఏజెన్సీలోని అందాలను తనివితీరా ఆస్వాదించాల్సిందే! విశాఖ పేరు వినగానే మదిలో మెదిలే వాటిలో సహజ సిద్ధమైన బొర్రా గుహల సోయగాలు, అరకు లోయలోని అవిసెపూల అందాలు, చాపరాయి, కటిక తదితర జలపాతాల హొయలు తప్పక ఉంటాయి.

బొర్రా గుహలకు ఆ పేరు ఎలా వచ్చిందో...

జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన బొర్రా గుహలు విశాఖ నగరానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. సముద్ర మట్టానికి సుమారు 900 మీటర్ల ఎత్తులో అనంతగిరి మండలం బొర్రా వద్ద ఉండడం వల్ల ఈ గుహలకు బొర్రా గుహలనే పేరు వచ్చింది. వీటి గురించి వినడం మినహా చూడకపోవడంతో ఎంతో ఆసక్తితో విశాఖ నుంచి బయల్దేరాం. ఉదయం 6 గంటలకే విశాఖ నుంచి ఒరిస్సా వెళ్లే రాయఘడ్ పాసింజర్ ఉంది. ఈ పాసింజర్‌లో వెళ్లేందుకు చోటు దొరికిందంటే అదృష్టమే. ఎందుకంటే ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అందువల్ల ముందుగా రిజర్వేషన్ చేయించుకోవడం ఉత్తమం. రైలు ప్రయాణంలో మనకు కలిగే అనుభూతి అంతా ఇంతా కాదు. పచ్చటి తివాచీలు పరచినట్లుండే మైదానాలు, కనువిందుచేసే ఎత్తయిన శిఖరాలు, లోయలు మనల్ని పరవశుల్ని చేస్తాయి. ప్రయాణంలో ఎదురయ్యే 52 టన్నెల్స్ చిత్రమైన అనుభూతికి లోనుచేస్తాయి. దాదాపు 14 కిలోమీటర్ల దూరాన్ని చీకటి గుహల ద్వారా ప్రయాణించడంలో ఓ రకమైన గగుర్పాటు, పులకరింత మన వశమవుతాయి. ఉద్వేగపూరిత బొర్రా విహార యాత్రలో కలిగిన అద్భుతమైన అనుభూతి మన జీవితంలో మరపురాని అనుభవంగా నిలిచిపోతుంది. ఇక విశాఖ నుంచి అరకు బస్సు ఛార్జీ రూ. 56. బస్సులో వచ్చేవారు బొర్రా జంక్షన్ వద్ద దిగితే సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని బొర్రా గుహల వద్దకు రూ. 10 నుంచి రూ. 20 ఛార్జీతో జీపు లేదా ఆటోలో చేరుకోవచ్చు.

బొర్రా రైల్వే స్టేషన్‌లో దిగిన తరువాత అర కిలోమీటరు దూరంలో బొర్రా గుహలుంటాయి. ఇవి వంద మీటర్ల వ్యాసంతో ప్రవేశద్వారం కలిగి సుమారు ఒక కిలోమీటరు పొడవు సొరంగంగా ఏర్పడింది. ఈ సొరంగంలో చాలాచోట్ల మూడు అరలు కలిగిన సొరంగాలు ఉన్నాయి. ఈ గుహలను సందర్శించాలంటే ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ. 25, పిల్లలకు రూ. 15, కెమెరాకు రూ. 10. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తెరిచివుంచుతారు.

అచ్చెరువొందించే అందాలు

గోస్తనీనదికి సంబంధించిన కొండయేరులు, సెలయేరుల నీటి తాకిడికి సున్నపురాతి పొరలు కరిగి మెల్లగా సున్నపురాతి నిక్షిప్తాలుగా భూమి నుంచి పైకి, కప్పు నుంచి భూమికి వారధిగా నిక్షిప్తమయ్యాయి. ఇవి రకరకాల జంతు, మానవ ఆకృతులు దాల్చి నిగనిగలాడే తెల్లదనంతో మనసుకు ఉల్లాసాన్ని కలగజేస్తాయి. ఈ నిక్షిప్తాలే పులి, గోవు పొదుగు, శివపార్వతులు, తల్లీబిడ్డలు, ఉన్న రుషి, మానవ మెదడు, మొసలి మొదలైన అద్భుత ఆకృతులుగా ఆవిర్భవించాయి. గుహల్లో వేర్వేరుచోట్ల ఇవన్నీ వాటి సహజత్వాన్ని చాటుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ గుహల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యంతో మనం చక్కగా చూడొచ్చు. కానీ 1994 వరకూ కాగడాల సహాయంతో చూసేవారు. అందువల్ల గుహ లోపల మసి ఏర్పడి కొన్ని ఆకృతులు కనుమరుగయ్యాయి.

అరకు టూరిజం ప్యాకేజీ

1. విశాఖపట్నం-అరకు రైలు కమ్ రోడ్ ప్యాకేజీ టూరు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ.
దర్శనీయ ప్రదేశాలు... అరకు, బొర్రా గుహలు, జంగిల్ బెల్స్/తైడా. 2. విశాఖపట్నం-అరకు రోడ్డు ప్యాకేజీ టూరు : ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, పెద్దలకు రూ.310, పిల్లలకు రూ.250.

బొర్రాగుహలు

కటిక సొగసు చూడతరమా!

ఇక వాటర్ ఫాల్స్ విషయానికి వస్తే కటిక, రణజిల్లెడ, డుంబ్రిగుడ చాపరాయి తదితరాలు ఉన్నాయి. వీటిలో కటిక జలపాతానికి వెళ్లడం చాలా కష్టం. బొర్రా గుహల నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలోనున్న ఈ ప్రాంతానికి తీసుకెళ్లి తీసుకొచ్చేందుకు ఒక్కో పర్యాటకుడి వద్ద నుంచి రూ.100 నుంచి రూ.150వరకూ జీపు యజమానులు వసూలు చేస్తారు. మట్టి రోడ్డుతో, సన్నని దారితో ఇక్కడికి వెళ్లడం కష్టంగా అనిపిస్తుంది. అయినప్పటికీ మార్గమధ్యలో కనిపించే పచ్చని దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటాయి. జీపు దిగిన తరువాత సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లాలి. అది కూడా ఒకరిద్దరు మనుషులు వెళ్లేంత సన్నని దారిలో. గుట్టలు, రాళ్లు, వంతెనలు దాటుకుంటూ వెళ్లాలి. మహిళలు, పిల్లలు, వృద్ధులు అక్కడికి వెళ్లాలంటే ఒకింత కష్టమే. అనంతరం మనకు కనిపించే అపూర్వ దృశ్యాలు మన కష్టాన్నంతటినీ తేలికచేస్తాయి. సుమారు వెయ్యి మీటర్ల ఎత్తు నుంచి పడే జలపాతం మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అక్కడ స్నానం చేస్తే ఆ అనుభూతే ఎంతో ఆనందాన్నిస్తుంది. ఇక్కడినుంచి అరకు వెళ్లాలంటే బొర్రా జంక్షన్‌కు వెళ్లాలి. బొర్రా గుహల నుంచి అక్కడివరకూ వెళ్లేందుకు రూ.10 నుంచి రూ.20 వరకూ జీపు ఛార్జీ అవుతుంది. అక్కడినుంచి అరకులోయ వెళ్లేందుకు రూ.10 బస్సు ఛార్జీ.

ఆకట్టుకునే గిరిజన మ్యూజియం

అరకులోయ టౌన్‌షిప్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో గిరిజన మ్యూజియం ఉంది. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు, వారి జీవన విధానాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు అరకులోయలో మ్యూజియం ఆఫ్ హేబిటేట్స్ ఏర్పడింది. ఈ మ్యూజియంలో విశాఖ, విజయ నగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లోని 23 తెగల గిరిజనులు తమ దైనందిన జీవితంలో వినియోగిస్తున్న వ్యవసాయ పనిముట్లు, వేటకు ఉపయోగించే వివిధ ఉపకరణాలు, సాంప్రదాయ నృత్యాల్లో ఉపయోగించే వస్తువులు, గిరిజన మహిళల ఔన్నత్యాన్ని తెలిపే ఆభరణాలను భద్రపరిచారు. గదబ, సవర, జాతాపు, భగత, కొండదొర, కొండరెడ్డి, కోందు, కొటియ, పరెంగిపోర్జ, వాల్మీకి, మన్నెదొర, మాలి, పూడి తదితర తెగలకు సంబంధించిన సమాచారం కూడా ఉంది.

రాష్ట్రంలో తొలి గిరిజన సాంస్కృతిక ప్రదర్శన శాలగా దీన్ని చెప్పొచ్చు. 1996లో రూ.13 లక్షలతో నిర్మించిన ఈ మ్యూజియాన్ని అప్పటి గవర్నర్ కె.కృష్ణకాంత్ ప్రారంభించారు. రెండంతస్తుల్లో నిర్మించిన ఈ మ్యూజియంలో మొదటి గదిలో సంగీత వాయిద్య పరికరాలు, రెండో గదిలో వ్యవసాయ పనిముట్లు, మూడో గదిలో వేటకు ఉపయోగించే పరికరాలు, నాలుగో గదిలో గిరిజన నృత్యరీతులను వివరించే మట్టిబొమ్మలు, ఐదో గదిలో గిరిజనుల ఇళ్ల మాదిరి నిర్మాణాలు ఉంటాయి. ఇక్కడ గిరిజన కళాకారులు తయారు చేసిన వస్తు ఉత్పత్తులు కూడా అమ్ముతారు. వెదురుతో తయారుచేసిన హ్యాంగర్లు, గాజుల స్టాండ్, ఫ్లవర్‌వాజ్‌లు, సబ్బుపెట్టెలు, ఫైల్ బాక్స్ వంటి 30 నుంచి 40 రకాల వస్తువులు లభ్యమవుతాయి. మట్టితో తయారైన టెర్రకోట ఆకృతులు, దీపపు సమ్మెలు, జంతువులు-పక్షుల బొమ్మలు, వేటాడేందుకు ఉపయోగించే బాణాలు, వెదురు బొమ్మలు, మట్టి బొమ్మలు, సంప్రదాయ వాయిద్యాలైన తుడుం, కిరీటాలు తదితరాలు లభ్యమవుతాయి.

పద్మాపురం ఉద్యానవనం

అరకులోయ టౌన్‌షిప్‌కు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో పద్మాపురం ఉద్యానవనం ఉంది. ఇక్కడికి ఆటో ఛార్జీ రూ.20 తీసుకుంటారు. ఇక్కడ పుష్పాలతో తయారు చేసిన వివిధ ఆకృతులు, కనువిందు చేసే పుష్పాలు, ఎప్పుడూ చూడని వందల రకాల పుష్పజాతులు మనకు కనిపిస్తాయి. కొన్ని చలన చిత్రాల షూటింగ్ కూడా ఇక్కడ జరిగిందంటే ఈ ప్రాంతం ఎంత అందంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

గన్నెల జంక్షన్

గన్నెల జంక్షన్ సమీపంలోని గార్డెన్స్ చలన చిత్రరంగాన్ని



శ్రీకాకుళం

బొర్రా చరిత్ర

బొర్రా గుహల విషయానికి వస్తే ఆంగ్లేయ భూగర్భ పరిశోధకుడు డబ్ల్యు కింగ్ 1807లో బొర్రా గుహల్ని కనుగొన్నాడు. ఈ గుహలు సహజసిద్ధంగా సుమారు 150 మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు, కాలక్రమేణా ఈ ప్రాంతంలోని సున్నపురాతి పొరలు కరిగి గుహలుగా ఏర్పడినట్లు నిర్ధారించారు. 1932లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన మ్యాప్‌లో ఈ గుహలు నమోదయ్యాయి. విశాఖలోని గోస్తనీనది ఈ సున్నపురాతి గుహల్లో ఆవిర్భవించి బొర్రా గుహల ద్వారా పయనించి ఒక జలపాతంగా ఏర్పడింది. ఇది తూర్పుదిక్కుగా పయనించి భీమునిపట్నం దగ్గర బంగాళాఖాతంలో విలీనమవుతుంది. ఈ సొరంగం అంతర్భాగంగా సుమారు 30 వేల నుంచి 50 వేల సంవత్సరాలనాటి ప్రాచీన మానవ చారిత్రక అవశేషాలను ఆంధ్రా యూనివర్శిటీ మానవ శాస్త్రవేత్తలు కనుగొన్నారు.


గిరిజన మ్యూజియం

విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతం అవిసెపూల అందాలతో విశేషంగా ఆకట్టుకుంటుంది. ఎత్తయిన కొండలు, అవిసెపూలతో ఆకర్షించే ఈ ప్రాంతంలో తెలుగుతోపాటు పలు భాషా చిత్రాల షూటింగ్‌లు జరుగుతూ వుంటాయి. 'వాన' చిత్రం షూటింగ్ ఇక్కడే జరిగింది. పొగమంచు కురుస్తుండగా సూర్యకిరణాలు వస్తున్న సమయంలో అవిసెపూలను చూస్తుంటే మనసు ఏదో తెలియని హాయితో ఉరకలేస్తుంది. నవంబరు నుంచి జనవరి వరకూ ఈ పంట సోయగాలు వీక్షించేందుకు అనువైన సమయం. అరకు నుంచి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి బస్సులు కూడా వెళ్తాయి. బస్సులో వెళ్తే రూ.4 ఛార్జీ అవుతుంది. అదే ఆటోలో వెళ్తే రూ.70 వరకూ అవుతుంది.

ఆకట్టుకునే

రణజిల్లెడ, చాపరాయి జలపాతాలు

జలపాతాల హొయలు, సోయగాలు వీక్షించాలంటే తప్పక వెళ్లాల్సిన ప్రాంతాలు రణజిల్లెడ, డుంబ్రిగుడలోని చాపరాయి జలపాతాలు. పద్మాపురం గార్డెన్స్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో రణజిల్లెడ జలపాతం ఉంది. ఇక్కడికి వెళ్లాలంటే ఆటోకు కనీస ఛార్జి రూ.50 చెల్లించాల్సిందే. రణజిల్లెడ వాటర్‌ఫాల్స్ వద్ద 60 నుంచి 70 అడుగుల ఎత్తు నుంచి ప్రవాహం కిందకు పడుతుంది. అరకులోయకు 15 కిలోమీటర్ల దూరంలో డుంబ్రిగుడ వద్ద చాపరాయి జలపాతం ఉంది. చాపరాయిలా ఉంటుంది కాబట్టి ఈ జలపాతానికి ఆ పేరు వచ్చింది. చాపరాయి ప్రాంతంలోని కురిడిగడ్డ వద్ద సినిమా షూటింగ్‌లు జరుగుతూ ఉంటాయి. అరకు నుంచి పాడేరు వెళ్లే రహదారిలో ఉన్న ఈ జలపాతానికి బస్సు ఛార్జీ ఆరు రూపాయలే. జీపు, ఆటో ఛార్జీ మాత్రం రూ.200 నుంచి రూ.300 వరకూ ఉంటుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలి.

అరకు విడిదికి...

1. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌వి (అరకులోయలో)

ఎ. పున్నమి వేలీ రిసార్ట్స్ బి. పున్నమి హిల్ వ్యూ రిసార్ట్స్

2. ప్రయివేటు హోటళ్లు

1. రాజధాని హోటల్, వసుంధర రెస్టారెంట్, 2. బాలాజీ హోటల్, 3. థింసా, 4. క్రిష్ణతార హోటల్, 5. ఉషోదయ లాడ్జి, 6. వికాస్ రిసార్ట్స్, 7. సాయి క్రిష్ణ లాడ్జి, 8. ట్రైబల్ హట్స్, 9. శ్రీనివాస లాడ్జి, 10. వెంకటేశ్వర లాడ్జి, 11. వశిష్ట హోటల్, 12. హోటల్ పృధ్వీదేవి, 13. హిల్ పార్కు లాడ్జి, ప్రభుత్వ అతిథి గృహాలు, 1. పోర్టు గెస్టుహౌస్. ఇవికాక 2. జిల్లా పరిషత్ గెస్టుహౌస్ , 3. ఐటిడిఎ గెస్టుహౌస్, 4. టెలికం గెస్టుహౌస్ , 5. ఫారెస్టు గెస్టుహౌస్ , 6. ఆర్ అండ్ బి గెస్టుహౌస్ , 7. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్, 8. సాయిల్ గెస్టుహౌస్.ప్రయివేటు లాడ్జీలలో బస చేయాలంటే సింగిల్ బెడ్ రూమ్‌కు రూ.250 నుంచి రూ.2,500 వరకూ ఛార్జీ చేస్తారు.





❖ ❖ ❖

ఏనుగు మల్లమ్మ కొండ

హార్స్‌లీహిల్స్‌గా మారిన వేళ

1840కి ముందు ఇప్పటి హార్స్‌లీహిల్స్‌ను ఏనుగు మల్లమ్మ కొండగా పిలిచేవారు. ఈ కొండపై పూర్వం మల్లమ్మ అనే మహిళను చిన్న పాపగా ఉన్నప్పుడు ఏనుగులు పెంచాయని... ఆ తరువాత కాలంలో ఆమె పెద్దదై ఇక్కడ గ్రామీణులకు వైద్యం చేసి ప్రాణదానం చేస్తుండేదని... ఆ తరువాత ఆమె కనపడకపోవడంతో ఆమెను దేవతగా భావించి... ఇక్కడి వారు ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ కొండను ఏనుగు మల్లమ్మ కొండగా పిలిచేవారు. అప్పట్లో ప్రతియేటా ఈ కొండ పరిసర గ్రామస్తులు ఆ కొండపై మల్లమ్మ జాతర నిర్వహించేవారు. కొండ పైకి వెళ్లాలంటే అడవిదారిలో కాలినడకనే వెళ్లాల్సి వచ్చేది. ఈ అడవిలో చిరుత పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు ఉండేవని చెబుతుంటారు. ఏనుగు మల్లమ్మ





కొండకు హార్స్‌లీహిల్స్ అనే పేరు రావడానికి ఓ కథ ఇక్కడ ప్రాచుర్యంలో ఉంది. హార్స్‌లీ అనే ఇంగ్లీషు దొర 1840-43 ప్రాంతంలో ఈ కొండపైకి గుర్రంపై వెళ్లడంతో దీనిని అప్పటి నుండి ఏనుగు మల్లమ్మ కొండ పేరు హార్స్‌లీహిల్స్‌గా మారిందని అంటారు. హార్స్‌లీ దొర కొండపైనవున్న వాతావరణానికి ముగ్ధుడై అక్కడే ఓ గెస్ట్‌హౌస్‌ను నిర్మించుకుని తన విడిదిగా ఏర్పాటు చేసుకున్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన పిమ్మట రాష్ట్రగవర్నర్లు వేసవిలో హార్స్‌లీ నివసించే గృహాన్ని వేసవి విడిదిగా ఉపయోగించుకునే వారు. దీనికి గవర్నర్స్ బంగ్లాగా పేరు వచ్చింది. మరొక గృహాన్ని అటవీశాఖ అతిథిగృహంగా ఉపయోగిస్తున్నారు.

ఒకప్పటి హార్స్‌లీహిల్స్

టూరిజమ్ శాఖ అడుగిడక ముందు హార్స్‌లీహిల్స్ పేదల వేసవి విడిదిగా ఉండేది. ఎక్కడెక్కడినుండో పేద, మధ్యతరగతి ప్రజలు వేసవికాలంలో ఇక్కడికి వచ్చి సేద తీరేవారు. వీరిని నమ్ముకుని కొండపై సుమారు 30 కుటుంబాల వారు బతుకుదెరువు పొందేవారు. మొదటగా జవహర్ నవోదయా స్కూల్‌ను ఇక్కడే ప్రారంభించడం జరిగింది. ఆదివారాలు, వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పరిసర ప్రాంతాల వారు తమ పిల్లలను తీసుకుని హార్స్‌లీహిల్స్‌కు వచ్చే వారు. అప్పట్లో ఇక్కడ సరసమైన ధరలకే భోజనం, చిరుతిండ్లు లభించేవి. అంతేగాక ఎంతో ఆప్యాయతతో పలకరించే జనం మనకు కనిపించేవారు. ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గ్రామీణ సౌందర్యం, పిల్లగాలులు, గంధపు చెట్ల గుభాళింపులు పర్యాటకులకు స్వాగతం పలికేవి. అప్పట్లో పైభాగంలో వున్న శ్రీకృష్ణుడి ఆలయానికి, అడవిలోని శ్రీవెంకటేశ్వరస్వామి పాదాలకు, ఏనుగు మల్లమ్మ దేవాలయంలోనూ విశేషంగా పూజలు జరిపేవారు. ప్రతి సంవత్సరం ఏనుగు మల్లమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించే వారు. ప్రస్తుతం టూరిజం శాఖ హార్స్‌లీహిల్స్‌ను పర్యాటక కేంద్రంగా గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకుంది.

'జల'కళతో పెరిగిన 'జన'కళ

ఇటీవల కురిసిన వర్షాలకు హార్స్‌లీహిల్స్‌లోని కుంటల్లో జలకళతోపాటు రెండు సంవత్సరాల ముందు ఎండిపోయిన వృక్షాలు జీవం పోసుకుని పచ్చదనంతో కొండ శోభాయమానంగా ముస్తాబైంది. ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఎన్విరాన్‌మెంటల్ పార్క్, మ్యూజియం, హై వ్యూ సీయింగ్ సైట్ / సూసైడ్ స్పాట్ (ఇక్కడి నుండి కిందకు చూస్తే పొలాలు మ్యాప్‌లోని అవుట్‌లైన్ ఇండియాలా కనబడుతుంది), గాలిబండ (కన్యాకుమారిలో సూర్యోదయం ఏవిధంగా కనిపిస్తుందో, ఇక్కడి నుండి సూర్యాస్తమయం అలా కనబడుతుంది) తదితర ప్రదేశాలు నిత్యం జనంతో కిటకిటలాడుతున్నాయి.

చూడదగిన ప్రదేశాలు

గంగోత్రి... మనం హార్స్‌లీహిల్స్‌కు వెళ్లే దారిలో మొదటగా మనకు ఎదురయ్యేది గంగోత్రి సరస్సు. ఈ సరస్సు చుట్టూ పచ్చని చెట్లు ఉండ టంతో ఆ చెట్ల ప్రతిబింబాలు నీటిలో కనపడుతూ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అంతేగాక అడవి జంతువులు తమ దాహార్తిని తీర్చుకునేందుకు ఈ సరస్సు వద్దకు వస్తుంటాయి.

హైవ్యూ సీయింగ్ సైట్... దీన్ని సూసైడ్ స్పాట్ అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతం ప్రత్యేకత ఏమిటంటే మనం ఇక్కడి బండపై నిలబడి కిందకు చూశామంటే కింద ఉన్న పొలాలు మ్యాప్‌లోని ఇండియాలా కనపడుతుంది. ప్రకృతి సహజసిద్ధంగా రూపొందిన ఈ ఇండియా ఔట్‌లైన్ మ్యాప్ చూసేందుకు పర్యాటకులు ఎగబడతారు. ఇక్కడ అజాగ్రత్తగా ఉంటే మాత్రం ఇక అంతే. కిందపడిపోవడం ఖాయం. ఇక్కడి నుండి చాలా మంది కిందకు దూకి ఆత్మహత్య చేసుకోవడంతో దీనికి 'సూసైడ్ స్పాట్' అనే పేరు వచ్చింది.

గాలిబండ... హార్స్‌లీహిల్స్‌లో చెప్పుకోదగ్గ ప్రాంతం గాలిబండ. ఇక్కడ ఎంత వేసవి ఎండలు మండుతున్నా చల్లటిగాలి రావడం గమనార్హం. అంతేగాక ఈ ప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహ ఒకటి ఉంది. ఈ గుహలో నుండి సాయంత్రం వేళ బయటకు చూస్తే కన్యాకుమారిలో సూర్యోదయం ఏవిధంగా కనిపిస్తుందో, ఇక్కడి నుండి సూర్యాస్తమయం అలా కనబడుతుంది.

ఎన్విరాన్‌మెంటల్ పార్క్... హార్స్‌లీహిల్స్ పైకి వెళ్లగానే మనకు మొదటగా కనపడేది ఎన్విరాన్‌మెంటల్ పార్క్. ఈ పార్క్‌లో మన దేశంలో అరుదుగా కనిపించే పక్షులు, జంతువులను పర్యాటకుల కోసం ఉంచారు. నెమలి పురివిప్పి ఆడే ఆరుదైన దృశ్యాన్ని మనం ఇక్కడ చూడవచ్చు. పిల్లలు ఆడుకోవడానికి ఉయ్యాలలు, జారేబండలు ఇంకా అనేకం ఇక్కడ ఉన్నాయి. ఇక్కడి క్రోకడైల్ పార్క్ (మొసళ్లు) పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సుమారు ఐదు మొసళ్లు ఇక్కడ ఉన్నాయి.

మ్యూజియం... హార్స్‌లీహిల్స్ చరిత్ర గురించి తెలుసుకోవాలన్నా, ఈ ప్రాంతంలో దొరికే అటవీ ఉత్పత్తులు, జంతువుల వివరాల గూర్చి తెలుసుకోవాలన్నా ఈ మ్యూజియం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక్కడ చిరుతపులి, ఎలుగుబంటి, దాసరిపాము (కొండచిలువ వంటిది) శిథిలాలను ఇక్కడ ఉంచారు. అంతేగాక కింద నుండి పైకి వెళ్లే దారిలో వివిధ రకాల కోతులు కనిపిస్తాయి. ఏవైనా తినుబండారాలు వాటికి అందిస్తే ఎంతో ఆనందంగా వచ్చి తీసుకెళ్తుంటాయి.

పురాతన నీలగిరి వృక్షం... ఇక్కడి ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ సమీపంలో పురాతన నీలగిరి వృక్షం ఉంది. ఇది 1858లో హార్స్‌లీదొర నాటారు. ఈ వృక్షానికి కేంద్రప్రభుత్వం మహావృక్ష పురస్కార్ అవార్డును ఇచ్చింది.

ఇవండీ ఆంధ్రా'ఊటీ'ల ఊసులు. వీలు చేసుకొని చూడొచ్చేమో! ❋

హార్స్‌లీహిల్స్ బస్సు వివరాలు

మదనపల్లె నుండి హార్స్‌లీహిల్స్ 24కిలోమీటర్ల దూరంలో ఉంది. మదనపల్లె నుండి హార్స్‌లీహిల్స్‌కు వెళ్లాలంటే ఇక్కడి ఆర్‌టిసి బస్టాండు నుండి ప్రతి రోజూ ఉదయం 6.15గంటలకు ఒక సర్వీసు, 8.30గంటలకు ఒక సర్వీసు, సాయంత్రం 5 గంటలకు ఒక సర్వీసును నడుపుతున్నారు.

విడిది కేంద్రాలు

పర్యాటకులు కొండపై ఉండేందుకు వీలుగా విడిది కేంద్రాలు ఉన్నాయి.పున్నమి రిసార్ట్ వారు కొన్ని కాటేజీలను పర్యటకుల కోసం నిర్మించారు. ఏపి టూరిజమ్ ఆధ్వర్యంలో ఇక్కడ కాటేజీలు నిర్మించారు. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్, రెవెన్యూ శాఖలకు సంబంధించి రెండు గెస్ట్‌హౌస్‌లు, సినీయాక్టర్ జమున కాటేజీని ఇక్కడ పర్యాటకులు ఉండేందుకు అద్దెకు ఇస్తున్నారు.





కథ

వాడపల్లి శ్రీరామమూర్తి

పాప తల్లి

ఇల్లంతా గోల గోల. నడవాలో చుట్టూ కుర్చీలు వేశారు. మధ్యలో పక్కన టీపాయ్ మీద పళ్లు, స్వీట్లు, ఊదొత్తులు... వాటి పొగ హాలంతా కమ్మేసింది. ఒక మూల టేబుల్ మీద స్పీకర్ పెట్టి గట్టిగా షణ్ముఖ ఆంజనేయులువి, శ్రీరాముడి పద్యాలు పెట్టారు. మధ్యలో అంతకన్న గట్టిగా లల్లూ ఏడుపు వినిపిస్తోంది. ఆ లోపల పక్క గదిలో భోషాణం దగ్గర కూర్చుని టేబుల్‌ఫ్యాన్ పెట్టుకుని బాగా ముస్తాబైన సుజాత కనిపించింది. పక్కన ఉయ్యాలలో లల్లూ ఏడుస్తోంది. వంటింట్లోంచి మూకుడులో ఏదో వేయించుతున్నట్టుంది అత్తగారు. పోపు ఘాటుతోపాటు అట్లకాడ చప్పుడూ బాగానే వస్తోంది.

'ఇది దొంగముండా ఆవులా వుందయ్యా! పాలు ఎగచేపేస్తోంది' అన్నాడు రంగడు. 'అదేంటిరా అలా అంటావు? గత ఈతకి బాగా పాలిచ్చిందనీ, డబ్బు అవసరానికి అమ్ముతున్నాననీ అన్నాడు కదరా? తిరిగిచ్చేద్దాం కబురు పెట్టు' అన్నాడు నాయుడు. రంగడు ఆవు వేపు చూపిస్తూ "పొదుగులో పాలున్నాయి. ఎగచేపేసి తర్వాత దూడకి ఒదులుద్ది. అదుగో చూడండి. దూడ ఎలా తాగేస్తోందో" అన్నాడు. సుశీల ఆ మాటలు వినబడి వంట ఇంట్లోంచి తొంగి చూసింది. పెయ్య చకచకా పాలు తాగుతోంటే ఆవు దాన్ని ఆప్యాయంగా నాకుతోంది. నాయుడుగారు నవ్వుతూ...

'సరే చూద్దాంలే. తొందరపడడం ఎందుకు? రెండు రోజులు చూడు. కాకపోతే పంపిచ్చేద్దాం' అన్నాడు.

సుశీల పాపకి పాలిస్తూ నవ్వుకుంది. 'నిన్న వూళ్లో జరిగిన మీటింగులో తల్లిపాలు బిడ్డకు అమృతం అని చెప్పిన మాటలు ఈ ఆవు కూడా విన్నట్లుంది. ఇవాళ తన దూడకి ఇచ్చేయాలని దాచుకుంది' అనుకుంటూ పాపని ఉయ్యాలలో వేసి తను డ్రస్సు మార్చుకొని వంటింట్లోకి వెళ్ళి చూసింది.

అత్తగారు నవ్వుతూ 'నీ టిఫిన్ రెడీ అమ్మాయ్' అంటూ బాక్సు అందించింది.

'వెళ్లొస్తానత్తయ్య. ఇవాళ మండల కేంద్రంలో మీటింగు... ర్యాలీ వున్నాయి. రావటం ఆలస్యం అవుతుంది' అంది కాస్త నెమ్మదిగా.

'నాకెందుకు చెప్తావ్ పిల్లా! మీ ఆయనతో చెప్పు! లేకపోతే మా ఆయనతో చెప్పు' అంది.

'ఆయన అప్పుడే వెళ్ళిపోయారు. మామయ్యగారేమో...' అని ఏదో చెప్పబోతుంటే

'పోనీ ఆడపడుచు అర్థమొగుడు కదా నాతో చెప్పు వదినా...' అంది నీళ్ళ బిందె కింద పెడుతూ సుజాత.

సుజాత బుగ్గలు సున్నితంగా మెలిపెట్టి 'పాపని నీ చేతుల్లో పెడుతున్నాను. బాగా చూసుకోవాలి సుమా' అని బయటకు నడిచింది.

'నో ఛాన్స్. నేను కొడుకును కనాలంటే ముందు పెళ్ళి చెయ్యి' అంది నవ్వుతూ వెళ్తున్న వదిన వైపు చూస్తూ! సుశీల కూడా నవ్వుతూ వెళ్లిపోయింది.

❁ ❁ ❁

మీటింగ్ హడావిడిగా వుంది. తల్లి పాల వారోత్సవాలు ఇవాళ నాలుగో రోజు. అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతరాళ్లు, పిల్ల తల్లులు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు... అందరూ వున్నారు. చాలా ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. డాక్టర్ గారు మాట్లాడుతున్నారు. కుర్చీలో కూర్చున్న సుశీల డైరీలో పాయింట్లు రాసుకుంటోంది. తనకూ నాలుగు నెలల క్రితమే పాప పుట్టింది. ఆ పాపని ఇంటి దగ్గర వదిలి పిల్లల గురించి తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తను ఊళ్ళో వాళ్ళకి చెప్తోంది. ఈ ఆలోచన రాగానే మనసు మూలిగింది.

ఈలోపు ఒక్కసారి డాక్టర్ గారి గొంతు వినబడి కంగారుగా చూసింది.

'ఈ దినం అన్ని కేంద్రాలలో ఎక్కువమంది బాలింతలను, తల్లులను చైతన్య పరచిన అంగన్‌వాడీ కార్యకర్త సుశీలను మనసారా అభినందిస్తున్నాను' అన్నారాయన. తను లేచి నిలబడి అందరికీ నమస్కరించింది.

బాలింతలందరికీ పౌష్టిక ఆహార పొట్లాలు పంచి పెట్టారు. పిల్లలని తెచ్చుకున్న తల్లులు వేరే గదిలో కూర్చొని పిల్లలకి పాలిస్తున్నారు. సుశీల గుండె బరువెక్కుతోంది. ఏ తల్లి చేతిలో పిల్ల కేర్‌మని ఏడ్చినా తన పాప లల్లూ ఏడ్చినట్టే వినిపించి ఒక్కసారి పాలు పొంగి జాకెట్టు తడిసినట్లు తెలిసిపోతోంది. మధ్యాహ్నం రెండవుతోంది. ఈ పాటికి లల్లూ పడుకొని వుంటుంది. తను మూడు నెలల సెలవు తర్వాత నెల క్రితం డ్యూటీలో చేరింది. అందువల్ల వేగంగా వెళ్ళిపోతానని అడగటం కుదరదు. సూపర్‌వైజర్ చికాకు పడొచ్చనుకుంది. అయినా అడగడానికి కూడా సమయమూ సందర్భమూ చూసుకోవాలి కదా అనుకుంది. స్టాఫ్ అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. నాలుగు గంటలకి 'మహిళలు - మమతల కోవెలలు' అనే రూపక ప్రదర్శన ఉంది. తను రాసిన 'శాంతి కాముకులైన స్త్రీలకు సరిరారు మగవారు' అనే పాట పాడతారు. ఈ ప్రోగ్రాం టీవీలో వస్తుంది. షూటింగ్ తియ్యడానికి టీవీ వీడియో వాళ్ళు వచ్చేశారు. అంతా హడావిడిగా వుండి. ఒక్కసారి తన సెల్ ఫోను మోగింది.

భర్త ప్రభాకర్ నించి 'మా చెల్లిని చూడటానికి పెళ్ళి వాళ్ళొస్తున్నారు. నాలుగు గంటలకు ఎలాగయినా వచ్చేయ్. నేను ఇంటికి వచ్చేశాను' అంటూ ఫోన్ పెట్టేశాడు. సుశీల గుండెల్లో రాయి పడింది. ఎలాగయినా వెళ్ళకపోతే ప్రమాదమే.

తను చైతన్య పరచిన వాళ్ళకి టీవీ వాళ్ళ అడిగే ప్రశ్నలు- చెప్పవలసిన సమాధానాలు నాలుగు రోజుల నుంచి రిహార్సల్స్ చేయించింది. మంచి సమయానికి తను ఉండటం లేదంటే ఎలా? అయినా తప్పదు. ఒక్కసారి ఏడుపొచ్చింది.

'నేనీ వుద్యోగం చెయ్యను నాన్నా. ఆడదాని వుద్యోగానికి ఆ ఇంట్లో విలువలేదు' అని నాన్నతో అన్నప్పుడు

'అన్ని రోజులూ ఒక్కలా వుండవు తల్లీ! ఆడదానికి తనకంటూ సంపాదన వుండాలి. తన కాళ్ళమీద తను నిలబడగలిగే శక్తి వుండాలమ్మా' అన్నారు నాన్న.

'ఇద్దరూ సంపాదించుకుంటే గానీ సజావుగా సంసారం గడవని రోజులివీ. కలెక్టరు గిరీ కాకపోయినా చన్నీళ్లకు వేన్నీళ్లుగా నా కోడలు సంపాదిస్తే తప్పేంటి?' అన్నారు మామయ్యగారు.

'కాని జరుగుతున్నదేంటి? తీసుకొంటున్న జీతానికి సగం వాటాకి తగినట్టు పని చెయ్యలేకపోతున్నాను' అనుకుంది బాధగా.

సూపర్‌వైజర్ సుమలత పక్కన వెళ్ళి నిలబడింది. 'ఏవమ్మా మాన్ ఆఫ్ ది మాచ్ సుశీల! ఇవాళ మొత్తం కవరేజీ అంతా నీదే! ఇంతకీ ఏం కావాలి?' అడిగింది కళ్ళెగరేస్తూ.

సుశీల జాలిగా మొహం పెట్టి 'థ్యాంక్యుండీ' అంటూ విషయం అంతా వివరించి చెప్పింది. ఆమె ఏం మాట్లాడలేదు.

దాంతో సుశీలే మళ్లీ కలుగచేసుకొని 'ఎలాగైనా నేను ఇంటికి వెళ్ళేటట్టు చూడండి డాక్టరు గారు. ఆయన దెబ్బలాడతారేమో' అంది భయం భయంగా.

సుమలతకి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయింది. నిజానికి నిన్నట్నుంచి ఆలోచిస్తోంది. ఎలాగయినా సుశీలని పక్కకి నెట్టేస్తే టీవీలో అంతా తనే కవర్ అయిపోతుంది. ఎందుకంటే సుశీల సూపర్‌వైజర్ తనే కాబట్టి. లోపలనించి తన్నుకొస్తున్న సంతోషం మునిపళ్ళతో పైపెదవి కొరుకుతూ నొక్కిపట్టింది సుమలత. ఆలోచించినట్టు ముఖంపెట్టి అటూ ఇటూ చూసింది. మళ్ళీ సుశీల వైపు చూసి

'పర్మిషను అడిగితే చెట్టు ఎక్కి కూర్చుంటాడీ డాక్టర్‌గారు. ఇలాంటప్పుడు ఆడవాళ్ళకి ఒకటే ఆయుధం! లేడీస్ ప్రాబ్లమ్. అర్జంటుగా ఇంటికి వెళ్ళాలి అని అడుగు. కాదంటే నీ వెనక మేమందరం వుంటాం. మీ యూనియన్ వైస్ ప్రెసిడెంటు ఈ మండలంలోనే వుందన్న సంగతి మరిచిపోకు' అంది.

అతి కష్టం మీద డాక్టరుగారి దగ్గరకెళ్ళింది సుశీల. ఏంటి? అన్నట్టు కనుబొమలెగరేశా దాయన.

'సార్ లేడీస్ ప్రాబ్లమ్. అర్జంటుగా ఇంటికి వెళ్ళాలి. ప్లీజ్ సార్' అంది దండం పెడుతూ.

'దట్సాల్ రైటమ్మా! నువ్వు ఈ మధ్యనే కదా డెలివరీ అయ్యావన్నారు. వెంటనే వెళ్ళు'.

'సుమలతా! సుశీలని ఇంటికి పంపిస్తున్నాను. ఏదో ప్రాబ్లమ్ అంటోంది. నువ్వు మానేజ్ అవగలవా?' అన్నారు.

'అలాగే సార్. మీరున్నారుగదా సార్' అంది సిన్సియర్‌గా తెల్లచీర అంచు సర్దుకుంటూ.

❋❋❋

దేవుడికి దండం పెట్టుకుంటూ ఇంట్లో అడుగు పెట్టింది సుశీల. మామయ్యగారికి మూడ్ వస్తే గట్టిగా టేప్‌రికార్డు పెట్టిస్తారు. ఇల్లంతా గోల గోల. నడవాలో చుట్టూ కుర్చీలు వేశారు. మధ్యలో పక్కన టీపాయ్ మీద పళ్లు, స్వీట్లు, ఊదొత్తులు... వాటి పొగ హాలంతా కమ్మేసింది. ఒక మూల టేబుల్ మీద స్పీకర్ పెట్టి గట్టిగా షణ్ముఖ ఆంజనేయులువి, శ్రీరాముడి పద్యాలు పెట్టారు. మధ్యలో అంతకన్న గట్టిగా లల్లూ ఏడుపు వినిపిస్తోంది. ఆ లోపల పక్క గదిలో భోషాణం దగ్గర కూర్చుని టేబుల్‌ఫ్యాన్ పెట్టుకుని బాగా ముస్తాబైన సుజాత కనిపించింది. పక్కన ఉయ్యాలలో లల్లూ ఏడుస్తోంది. వంటింట్లోంచి ముకుడులో ఏదో వేయిస్తున్నట్టుంది అత్తగారు. పోపు ఘాటుతోపాటు అట్లకాడ చప్పుడూ బాగానే వస్తోంది.

లోపలకొచ్చిన సుశీలని చూసి 'ఊళ్లన్నీ ఏలడం అయినట్టుంది. ఇల్లు ఏమైనా ఎవరికీ పట్టదు' అంది విసురుగా. ఆ మాట తననే అని సుశీలకు తెలుసు. చంటిపిల్ల ఏడిచి ఏడిచి ఏమయిపోయినా ఎవరికీ పట్టదు. అనాలనుకున్నా అనలేక చటుక్కున పాపని తీసుకోడానికి ఆ గది వైపు చూసింది.

సుజాత చూసి 'సారీ వదినా! నేను లేచి వస్తే చెమట పట్టి పౌడరు పోతుందని అమ్మ దెబ్బలాడితేనూ' అంటూ నసిగింది.

'పర్వాలేదులే! నేను కాస్త ఆలస్యం అయినట్టున్నాను...' అంటూ ఉయ్యాలలో పిల్లని ఎత్తుకుంది.

'అవతల వాళ్ళు వచ్చేస్తున్నారు. జీడిపప్పు వేయించి పోపు వేసి నీళ్ళు మరిగించాను. కాస్త ఉప్మా కలుపు. నేను వెళ్ళి చీర మార్చుకుంటాను. తర్వాత పిల్లతో ఆడుకోవచ్చు' అనేసి అత్తగారు తిరిగి చూడకుండా ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

వస్తున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ పాపని ఉయ్యాల్లో వేసి వంటింట్లోకి పరిగెత్తింది సుశీల. 'ఉప్మా మాడిపోయిందంటే ఆయన కేకలేస్తారు' అత్తగారి మాటలు వినిపిస్తున్నాయి.

'పావు గంటలో వాళ్ళొచ్చేస్తున్నారు. అంతా రెడీయేనా' అంటూ మామయ్యగారు హడావిడి చేస్తున్నారు. పెరట్లోంచి రంగడు గోల పెడుతున్నాడు.

'అత్తయ్యా! ఉప్మా తయారయింది. కాస్త చూస్తారా' అడిగింది సుశీల.

'ఏం? ఉప్మా కలపడం కూడా మీ అమ్మ నేర్పలేదా? నేను చూస్తానుగానీ చంటిది ఒకటే ఏడుపు... ఎవరికీ తోచనివ్వకుండా బొంతకాకిలా.. ఆ గోల చూడు. కడుపు నొప్పిలా వుంది. ఏదైనా చుక్కల మందు వెయ్యి' అని సలహా ఇచ్చి వంటింట్లోకి వెళ్ళింది.

ఒక్కసారి లల్లూ దగ్గరకెళ్ళి చూసి 'దీనిది నొప్పి ఏడుపు కాదు ఆకలి ఏడుపు. నాది ఆ ఆకలిని చూసిన ఏడుపు' అనుకుంటూ ఉయ్యాలలోంచి తీసింది.

మామయ్యగారు విసురుగా గదిలోకి అడుగుపెట్టి 'పెరట్లోంచి రంగడు ఇందాకట్నించీ చెవి కోసిన మేకలా అరుస్తున్నా వినిపించుకోరు. ఎవరయినా చూడండి. మళ్ళీ వీధిలోకి పెళ్ళివారికి ఎదురు వెళ్ళాలి' అని వెళ్ళిపోయారు.

'సారీ వదినా. నేను లేవకూడదు' అంది సుజాత. చేసేది లేక చంటిపాపని ఉయ్యాలలో పడేసి సుశీల పెరటి వైపు వెళ్ళింది 'ఏం రంగా!' అంటూ.

రంగడు పాలగిన్నె చేతిలో పట్టుకుని అమ్మగారూ అని అరుస్తున్నాడు. కాస్త దూరంగా దూడని కట్టేశాడు. అది శక్తికొద్దీ అరుస్తూ ఆవువైపు మెడ సాగదీసి చూస్తున్నది. పెయ్యి మూతికున్న మూతిబుట్ట దాని అరుపుని బయటికి రానివ్వడం లేదు. ఆవు వెనక కాళ్ళు రెండూ తాడుతో బంధం వేసి పాలకోసం పొదుగు దగ్గర కూర్చున్నాడు రంగడు.

'ఏం రంగా! ఏం కావాలి?' అంది సుశీల.

'చాట తవుడు అమ్మగారూ. పెద్దమ్మగారు చాట తవుడు ఇయ్యనేదమ్మా. తవుడు పెడితే కదా ఆవు పాలిచ్చేది' అంటూ సుశీల వైపు తిరిగాడు రంగడు.

పొలంలో మేసి దూడకి పాలివ్వాలన్న తాపత్రయం ఆవుది. ఆవుని కట్టేసి దూడని దూరంగా నిలబెడితే పాలు ఎక్కువ చేపుతుందన్న సూత్రం రంగడిది. ఏమరుపాటుగా పొదుగులో చెయ్యిపెట్టిన రంగడు రెచ్చిపోయాడు. ముందూ వెనకా ఆలోచించకుండా ఆవుని బాదేస్తున్నాడు. ఆ సీను చూడలేకపోయింది సుశీల. ఇంతలో అత్తగారు రానేవొచ్చింది తవుడు చాటతో.

'నువ్వెళ్ళు సుశీలా! చీర మార్చుకో' అని ఏదో చెప్తున్న అత్తగారి మాటలు వినేస్థితిలో లేదు తను.

చెవుల్లో పాప ఏడుపు తప్ప ఏమీ వినబడటం లేదు. వెంటనే పరుగెత్తుకెళ్ళి ఉయ్యాలలో లల్లూని తీసుకుని నేల మీద కూర్చుని 'ఓసి ఓసి లల్లూ! ఏందిరా లల్లు పాపలూ! ఎందుకు ఏడుస్తుందే లల్లు పాపలూ' అంటూ పాపని గుండెల్లో పొదవి పట్టుకుంది అంతే!

'సుశీలా! అంటూ గాండ్రించినట్టు అరిచాడు భర్త ప్రభాకర్. దిమ్మెరపోయి అటు చూసింది. 'ఛీ! అని అసహ్యంగా సుశీల వైపు చూసి మనిషివా? పశువ్వా? నీకసలు బుద్ధుందా!' అన్నాడు. అంత కోపంగా తనెప్పుడూ భర్తని చూడలేదు. అంత అసహ్యంగా అతనెప్పుడూ మాట్లాడలేదు. ఆవుని కొడుతున్న రంగడిలా ఆ క్షణం కనిపించాడు. నిస్సహాయంగా పెయ్యిని చూస్తున్న ఆవు వైపు చూస్తున్న రంగడి క్రూరమైన చూపులు... నిప్పులు కక్కుతున్న భర్త కళ్ళల్లో కనిపించి భయంతో ఒణికిపోయింది. "ఆడుకునే టైమ్ కాదిది. వెళ్ళి చీర మార్చుకో. శనిలా వున్నావు. మొహం కడుక్కో అవతల వాళ్ళొచ్చేస్తున్నారు" అని వెంటనే వీధిలోకి వెళ్ళిపోయాడు. గుండెల్లో భారం కన్నీళ్ళలా కారిపోతోంది. ఈలోపు పెద్దగా అరుపులు, గోల వినబడి పెరటివైపు చూసింది. 'అమ్మో' అంటూ పెరట్లోంచి రంగడి అరుపులు వినబడ్డాయి. ఒక్కసారి అందరూ అటు పరిగెత్తారు. ఆవేశంలో రంగడు ఆవుని కొడుతూ పేడమీద కాలువేసి జారిపోయి ఆవుమీద పడిపోయాడు. ఈసారి ఆవు రంగడిని కొమ్ములతో ఎగరేసింది. అందరూ వాడిని వీధిలోకి తీసుకెళ్ళి పరిచర్యలు చేస్తున్నారు. పెరట్లోకి చూసింది సుశీల. రాట చుట్టూ తిరుగుతూ రొప్పుతూ గింజుకుంటున్న ఆవు కనిపించింది. మెడ కన్నిలో కాలు ఇరుక్కుని ఉచ్చులాగ బిగిసిపోయి ఉరిపడిపోయి మరో నిమిషం ఆలస్యం అయితే ఆవు చచ్చిపోతుందనిపించింది. బాధ, భయంతో కళ్ళు గుండ్రంగా తిప్పుతున్న ఆవుని చూసి ఒళ్ళంతా జలదరించింది. ఒక్కసారి పరిగెత్తి కత్తిపీట తెచ్చి ఆవు మెడకి వున్న కన్ని కోసేసింది. ఆవు వెంటనే ఆయాసపడుతూ లేచి దూరంగా దీనంగా నేలమీద పడివున్న దూడ దగ్గర కెళ్ళి వాసన చూసి నిశ్చేష్టంగా నిలబడింది. అప్పటికే దూడ చచ్చిపోయింది.

ఆక్షణంలో ఎందుకో సుశీల అప్రయత్నంగా పాపను గుండెలకు హత్తుకుంది.

❋

డా॥కాకర్లమూడి విజయ్



సామాన్యుల కోసం స్పేస్ టెక్నాలజీ

నాసా ప్రకారమే వందకు పైగా స్పేస్ టెక్నాలజీలు మనం ఉపయోగించే పరికరాల్లోనూ, తినే ఆహారంలోనూ, వాడే మందులలోనూ, మనకు అవసరమయ్యే వైద్య ప్రక్రియల్లోనూ నిగూఢమై ఉన్నాయి. గ్లోబల్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ నుండి వాడి పడేసే (డిస్పోజబుల్) లోదుస్తుల వరకూ అంతరిక్ష పరిశోధనా టెక్నాలజీల నుండి ఉద్భవించిన 'ఉపకరణాలే'. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ప్రపంచంలో తిరిగి వాడగలిగే అంతరిక్ష వాహనం స్పేస్‌షటిల్. దాదాపు రెండు దశాబ్దాల నుంచి స్పేస్ షటిల్ ప్రోగ్రాం అమెరికా అంతరిక్ష పరిశోధనలో విడదీయలేని, కీలకమైన భాగం అయిపోయింది. ఈ షటిల్ సాయంతో అంతరిక్షంలోకి, అక్కడి నుండి భూగోళం పైకి రాకెట్లను, స్పేస్ స్టేషన్ల విడిభాగాలను, మనుషులను చేరవేయడం సాధ్యపడింది. ఏదో పక్క ఊరికో, పక్క దేశానికో వెళ్ళి వచ్చినట్టు మనుషులు అడపాదడపా అంతరిక్షంలోకి వెళ్ళి రావడం, టన్నుల కొద్దీ సామాగ్రిని తీసుకుపోవడం, అక్కడెక్కడో శూన్యంలో పరిభ్రమిస్తున్న ఒక స్పేస్ స్టేషన్లోనే ఉంచి పరిశోధనలు చేయడం, ఒక బృందం పని అయిపోగానే మరో బృందాన్ని చేర్చి అంతకు ముందున్న వారిని తీసుకురావడం... ఇవన్నీ ఒకనాటి కలల్లో కూడా సాధ్యపడేవి కాదేమో గానీ నేడు బాగా అలవాటైన పనైపోయింది!

ఇంత అద్భుతమైన టెక్నాలజీ కేవలం అంతరిక్ష పరిశోధనకే పరిమితం కాలేదు. దాదాపు 100 ప్రయాణాల తరువాత స్పేస్ షటిల్ టెక్నాలజీ వందకంటే ఎక్కువ విధాలుగా ఇక్కడ, భూమ్మీది మనుషుల జీవితాలను ప్రభావితం చేసే, ఉపయోపడే టెక్నాలజీగా మారింది! నాసా ప్రకారమే 100కు పైగా స్పేస్ టెక్నాలజీలు మనం వాడే పరికరాల్లోనూ, తినే ఆహారంలోనూ, వాడే మందులలోనూ, మనకి అవసరమయ్యే వైద్య ప్రక్రియల్లోనూ నిగూఢమై ఉన్నాయి.

గ్లోబల్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ నుండి వాడి పడేసే (డిస్పోజబుల్) లోదుస్తుల వరకూ అంతరిక్ష పరిశోధనా టెక్నాలజీల నుండి ఉద్భవించిన 'ఉపకరణాలే'. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

కృత్రిమ హృదయం

మానవుల గుండెకు సంబంధించిన సమస్యల్లో చాలా వరకు ప్రాణాంతకమైనవే. కొన్ని సందర్భాలలో సహజమైన గుండె ఉండీ లాభం లేని పరిస్థితి వస్తుంది. అటువంటప్పుడు కృత్రిమంగా పని చేసే గుండె ఉంటే...? కేవలం రెండంగుళాల పొడవు, ఒక అంగుళం మందం, నాలుగు అవున్సుల కంటే తేలికైన 'పంపు' ఇప్పుడు యూరప్‌లో క్లినికల్ పరీక్షల్లో పాల్గొంటుంది. అక్కడ ఈ పంపు ఇప్పటికే 20 మందికి అమర్చబడింది కూడా. ఈ విజయానికి కారణం స్పేస్ షటిల్‌లో వాడిన ఫ్యూయల్ పంపులే. నాసా, డా॥మైఖెల్ డి బెకే అనే ప్రముఖ గుండె నిపుణుడు కలిసి రూపొందించిన సూక్ష్మ వెంట్రిక్యులార్ అసిస్ట్ పంపు ఇప్పుడు మనుషుల ప్రాణాన్ని నిలుపనుంది.

కృత్రిమ అవయవాలు

మనకి కాలో- చెయ్యో కృత్రిమంగా అమర్చవలసినపుడు, ఆ కృత్రిమ అవయవాలు బరువుగా, ఇబ్బందిగా ఉండటం సహజం. నాసా స్పేస్ షటిల్‌కి రక్షణగా వాడే 'ఫోమ్'ని బరువుగా ఉండే ప్లాస్టర్ మోల్డ్‌కి బదులు వాడటానికి అనుమతించింది. ఈ కొత్త పదార్థం తేలికైనదే కాక సులభంగా పని చేయడానికి అనువుగా ఉంటుంది.

ప్రాణం కాపాడే కాంతి

స్పేస్ షటిల్‌లో మొక్కల పెరుగుదల అధ్యయనానికై ఒక ప్రత్యేక కాంతిని ఇచ్చే టెక్నాలజీని రూపొందించి వాడుతున్నారు. ఇప్పుడు అదే టెక్నాలజీని పిల్లల్లో బ్రెయిన్ ట్యూమర్ల చికిత్సకు వాడుతున్నారు. ఈ కాంతిని విడుదల చేసే డయోడ్లను విస్కాన్సిన్ వైద్య కళాశాల డాక్టర్లు ఫొటో డైనమిక్ థెరపీ అనే ప్రక్రియలో బ్రెయిన్ ట్యూమర్‌లోని క్యాన్సర్ కణాలను చంపడానికి వినియోగిస్తున్నారు.

ఉష్ణోగ్రతా కొలమానాలు

సుదూర నక్షత్రాల ఉష్ణోగ్రతను కొలవడానికి ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లను స్పేస్‌షటిళ్లలో వాడటం పరిపాటి. అత్యంత దూరం నుండి కూడా ఉష్ణోగ్రతలను కొలవగలగడం ఒక అద్భుతం. అదే టెక్నాలజీని ఆప్టికల్ సెన్సార్ థర్మామీటర్ తయారీలో వాడటం జరిగింది. చెవి లోపల దీన్ని ఒక్క క్షణకాలం ఉంచితే కచ్చితమైన ఉష్ణోగ్రత చూపిస్తుంది!

నిలకడ సాధనాలు

స్పేస్‌షటిల్ ప్రయాణం నుండి తిరిగి వచ్చిన వారి సమతా స్థితిని పరీక్షించే సాధనాలను ఇప్పుడు వైద్య పరీక్షల్లో వాడుతున్నారు. తలకి బలమైన దెబ్బతగిలినా, స్ట్రోక్ వచ్చినా, మూర్ఛ, ఇంకా ఇతర కేంద్రీయ నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల పరీక్షకు ఈ సాధనాన్ని వాడుతున్నారు.

డయాగ్నస్టిక్ పరికరాలు

అన్ని వైద్య పరీక్షలూ చేయగల ఒక చిన్న సాధనాన్ని స్పేస్ షటిల్ టెక్నాలజీని ఉపయోగించి రూపొందించారు. ఈ చిన్న పరికరం వల్ల కేవలం 30 సెకన్లలో రక్త పరీక్షలు చేసి, ఆ ఫలితాలని పొందవచ్చు.

లాండ్‌మైన్ సమస్య

ప్రపంచ వ్యాప్తంగా ల్యాండ్‌మైన్లు చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించాయి. వాటిని నిర్వీర్యం చేయడం కూడా ప్రాణాంతకమైనదే. స్పేస్‌షటిల్‌లో వాడే ఇంధనం ఈ సమస్యను ఎదుర్కొనడానికి ఉపయోగపడుతోంది. మిగిలిపోయిన ఇంధనాన్ని నాసా ఉచితంగా ఇచ్చి సహకరిస్తుంది. ఈ ఇంధనంతో పనిచేసే ఒక సాధనాన్ని 'ల్యాండ్‌మైన్లు' ఉన్న ప్రాంతంలో ఉంచి వెలిగిస్తే (దూరం నుండి) ఆ విస్ఫోటనానికి ల్యాండ్‌మైన్లన్నీ నిర్వీర్యమైపోతాయి!

ట్రాకింగ్ వ్యవస్థ

అంతరిక్షంలో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ఉపయోగించిన ట్రాకింగ్ వ్యవస్థని ఇప్పుడు భూమ్మీద కూడా వాడుతున్నారు. టాక్సీలు, ఇతర వాహనాలు ఎక్కడున్నాయో తెలిపేందుకు ఈ వ్యవస్థ బాగా ఉపయోగపడుతుంది.

ఇవన్నీ కాక ఫైర్ రెసిస్టెంట్ ఫోమ్, గ్యాస్ లీక్ డిటెక్టర్, స్క్రూల బదులు వాడే సాధనాలు, నాసా విండ్ టన్నెల్‌లో ఎగరడానికి వాడిన సాధనాల ఆధారంగా రూపొందిన పిల్లల ఆట వస్తువులు.. ఇలా ఎన్నో పరికరాలు స్పేస్ టెక్నాలజీ నుండి వచ్చాయి.

అచ్చంగా సామాన్యుల ఉపయోగానికే కనిపెట్టినవి కాకపోయినా ఇటువంటి అద్భుత టెక్నాలజీ పరికరాలు సామాన్యులకే ఎక్కువ ఉపయోగ పడుతున్నాయి. ఇంకా ఉపయోగపడతాయి.

అమెరికా మిలటరీ తమ కోసం రూపొందించుకున్న ఇంటర్నెట్ ఇప్పుడు ఇంటింటా వ్యాపించలేదా?! మానవ మనుగడకు పంచభూతాలే కాదు సైన్సు కూడా కారణమే అనిపించడం లేదు?!

సమ్‌థింగ్ స్పెషల్

అచ్చంగా నీరే ఆహారం...

ఎస్.మస్తాన్‌వలి, కడప



వేళకు భోం చేయకపోతే... ఏమవుతుంది? పర్యవసానంగా అల్సర్ వస్తుంది. గ్యాస్ ఫాం అవుతుంది. నీరసం వస్తుంది. ఇలా ఎన్నో సమస్యల్ని చెప్పుకోవచ్చు.
మరి... ఒక రోజు కాదు రెండు రోజులు కాదు ఏకంగా గత ఇరవైమూడేళ్లగా ఆహారం ముట్టని ఆ మనిషిని ఏమనుకోవాలి?!
అవును. గత 23 యేళ్లుగా కృష్ణకుమారి కేవలం మంచినీటినే సర్వస్వంగా భావించి జీవిస్తోంది. అయితే, ఈ స్థితి ఆమె కోరుకున్నది కాదు. యాదృచ్ఛికంగా శరీరంలో కలిగిన మార్పులు ఈ స్థితికి తెచ్చాయి.
వివరాల్లోకి వెళితే..

కృష్ణకుమారిది కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలం, సర్వరాజుపేట గ్రామం. ఆమె ఆహారం ఏం తీసుకోదు. కేవలం నీళ్లు తాగుతూ జీవనం సాగిస్తోంది. ఐదో తరగతి వరకు చదువుకున్న కృష్ణకుమారికి తన 14వ ఏట (1983లో) గోపాల్‌రెడ్డితో వివాహం జరిగింది. అనుకోకుండా ఒక రోజు భోజనం చేసిన వెంటనే వాంతి వచ్చినట్లు... కడుపులో వికారంగా ఉన్నట్లు అనిపించింది. వాంతి చేసుకుంది. ఈ విషయాన్ని ఆమె పెద్దగా పట్టించుకోలేదు. ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. అయితే ఇలా మూడు నెలలపాటు వాంతులతో ఇబ్బంది పడింది. మనిషి కూడా బలహీనంగా తయారయింది. ఇక చేసేది లేక భర్తకు విషయం తెలిపింది. జిల్లాలోని ప్రముఖ వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. తమిళనాడులోని రాయవేలూరు సిఎంసి ఆసుపత్రిలో వైద్యం కోసం చేర్పించారు. అక్కడి డాక్టర్లు ఆమెను పదిహేను రోజులు తమ పర్యవేక్షణలో వుంచి వైద్య పరీక్షలు చేశారు. అదే సందర్భంలో ఆమె దిన చర్యలను గమనించారు. ఆహారం తీసుకుంటే వాంతులు అవుతున్నాయి. ఆహారం తీసుకోని రోజు ఆరోగ్యంగా ఉండడాన్ని వారు గుర్తించారు. రోజుకి ఐదు లీటర్ల నీటిని ఆమెకిచ్చారు. మొత్తంగా చూస్తే ఈమెకు ఎలాంటి అనారోగ్యం లేదని వైద్యులు నిర్ధారించారు. ఇంకేముంది! అప్పటి నుంచి ఇప్పటి వరకు మంచినీరే సర్వస్వంగా మారింది. అంతేకాదు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డా ఆరోగ్యంగానే ఉన్నారు. అయితే ఆ తర్వాత కొద్దిరోజులకే భర్త చనిపోయాడు.

మొదట్లో నీరు మాత్రమే తీసుకుంటూ జీవిస్తున్న విషయం తెలిసి కృష్ణకుమారిని చూడడానికి జనం వచ్చేవారు. ఇపుడు అందరికీ సర్వసాధారణమైంది. తను తినకపోయినా కుటుంబసభ్యులకు, బంధువులకు షడ్రుచులతో కూడిన ఆహారాన్ని వండిపెడుతోంది కృష్ణకుమారి. ఇంటి పనులు, పొలం పనులు ఎంచక్కా అందరి లాగా చేసుకుంటూ జీవిస్తోంది.

❄





శ్రీకాకుళం

కేసులోంచి బయటపడేదెలా!

నేను ప్రభుత్వ రంగ సంస్థలో పని చేస్తున్నాను. మా మేనల్లుడి భార్య 498ఏ కేసు పెట్టారు. అందులో నా పేరు ఇరికించారు. నాకు ఏ సంబంధం లేదు. నన్ను నాలుగు రోజులు రిమైండ్‌లో వుంచారు. నేను బెయిల్ మీద వచ్చాను. నాది నాలుగో పేరు. నా పేరు తొలగించుకొనే మార్గం ఉందన్నారు. హై కోర్టు ద్వారా పేరు తొలగించుకోవచ్చా? తెలుపగలరు?

రమేష్, విజయవాడ.

మీ పైన ఉన్న అభియోగం ఏ విధంగా చేసింది? చార్జిషీట్‌లో మీ మీద ఎటువంటి అభియోగం మోపింది? వివరంగా చూస్తే గాని విషయాన్ని చెప్పలేం. మీ మీద ప్రత్యేకమైనటువంటి అభియోగాలు లేకుంటే మాత్రం హై కోర్టులో క్వాష్ పిటిషన్ వేసి మీ పేరు తొలగించుకోవచ్చు. లేదా డిశ్చార్జి పిటిషన్ అక్కడే వేసుకొని మీ పేరు లేకుండా చేసుకోవచ్చు. చార్జిషీట్ కాపీ పంపండి. లేదా వకీలునైనా సంప్రదించండి. ❄

చట్టబద్ధమైన హక్కులు వుంటాయా?

వినియోగదారుల ఫోరం, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, ఎస్సీ ఎస్టీ, కమిషన్‌కు చట్టబద్ధమైన హక్కులు వుంటాయా? దొంగలకు శిక్షలు విధించే అధికారం ఉందా? జరిమానాలు విధిస్తే- సంస్థలు, వ్యక్తులు అమలు చేయని ఎడల ఏమి చేయాలి? వివరంగా తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

తుంపాల శ్రీరామమూర్తి, గాజువాక.

వినియోగదారుల ఫోరంలో వినియోగదారుడు తనకు జరిగిన సేవల లోపంకుగాను కేసు వేసుకోవచ్చు. తీర్పు వెలువడిన తర్వాత ప్రతివాది వారు దానిని అమలు పర్చనట్లయితే ప్రతివాది మీద అరెస్టు వారెంటు ఇచ్చే అధికారం ఉంటుంది. మానవ హక్కుల కమిషన్‌కు, ఎస్సీ-ఎస్టీ కమిషనర్ వార్కి వాది యొక్క హక్కులకు భంగం కలిగినట్లయితే నష్ట పరిహారం చెల్లించమని తీర్పు చెప్పవచ్చు. జరిమానా/నష్టపరిహారం చెల్లించనట్లయితే కమిషన్ వారిని ఆశ్రయిస్తే, వారు ఇంకా పైఅధికారులకు ఉత్తర్వులు పంపించి నష్ట పరిహారం ఇప్పించగల్గుతారు.

తీర్పుని అమలు పర్చనట్లయితే శిక్ష వేసి అమలు జరిపించే అధికారం వాటికి లేదు. కాని ఇవి పంపిన నివేదికలు గాని, ఉత్తర్వులను కాని ప్రభుత్వం వారు అమలు పరుస్తూనే ఉన్నారు. ❄

జి. ఎల్. నరసింహారావు

హైకోర్టు న్యాయవాది, 9848994240

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవు తున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020



ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

పాలు - 1 లీటరు, క్రీమ్ - 2 స్పూన్లు, వెనిల్లా ఎసెన్స్ - 1/2 స్పూన్, పాలపిండి - 3 స్పూన్లు, పంచదార - 1/2 కప్పు, వెనిల్లా ఫ్లావర్ ఉన్న , కస్టర్డ్ పౌడర్ - 1 స్పూన్

తయారు చేసే విధానము

లీటర్ పాలల్లో కస్టర్డ్ పౌడర్‌ను కలపాలి. దాన్ని బాగా మరిగించాలి. పాలపిండిని, పంచదారను విడిగా కొద్దిగా పాలతో మిశ్రమంగా తయారు చేసి దీన్ని మరుగుతున్న పాలతో కలపాలి. ఆ తరువాత మొత్తం మిశ్రమాన్ని బాగా కలుపుతూ పాలు చిక్కబడేంతవరకు మరగనివ్వాలి. కలిపే స్పూనుకు అంటుకునేంతవరకు ఉంచాలి. ఆ పదార్థం చల్లారిన తరువాత క్రీమ్, వెనిలా ఎసెన్స్ వేసి బాగా కలియపెట్టాలి. ఐస్‌ట్రేలో ఈ మొత్తం మిశ్రమాన్ని వేసి దాని పైభాగాన ఒక పోలిథిన్ కాగితాన్ని ఉంచాలి. ఆ తరువాత దాన్ని ఫ్రిజ్‌లో ఉంచాలి. గట్టిపడిన తరువాత ఒకసారి తీసి బాగా కలియపెట్టి మళ్లీ ఫ్రిజ్‌లో ఉంచాలి. తినేముందు డ్రైఫ్రూట్స్ ముక్కలు చల్లుకుని తింటే బాగుంటుంది.

పైనాపిల్ జ్యూస్

కావలసిన పదార్థాలు

పైనాపిల్ : 1 , ఉప్పు : తగ్గినంత
పంచదార : తగినంత

తయారు చేసే విధానము

పైనాపిల్ కాయ పై పెచ్చు బాగా తీసి కాస్త ఉప్పు వేసి కాయ మీద రుద్ది బాగా కడగాలి. చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. ఈ ముక్కలు, కొద్దిగా నీళ్లు పోసి గ్రైండు చేయాలి. దీనిని టీ వడకొట్టే వాటిలో కాస్త పెద్దవి కూడా ఉంటాయి. దానిని తీసుకుని పోస్తే రసమంతా కిందకు దిగిపోతుంది. మిగిలిన పిప్పిని మరలా మిక్సీలో వేసి మరి కొంచెం నీళ్ళు పోసి తిప్పి మరలా వడపోయాలి.

అలా రసమంతా వచ్చే వరకూ తీయాలి. తరువాత ఒక గిన్నెలో ఎంత రసముందో అంత పంచదార వేసి స్టౌ మీద పెట్టి పాకం పట్టాలి. తీసి పెట్టుకున్న పైనాపిల్ రసాన్ని అందులో పోసి కలియ పెట్టాలి. కాస్త తినే సోడా కూడా వేసి కలిపి చల్లారిన తరువాత సీసాలో పోసుకోవాలి.





టమాటో పలావ్

కావలసిన పదార్థాలు

బియ్యం - 1/2 కిలో, కొబ్బరి చిప్ప - 1, ఉల్లిపాయలు - 5
ఎండు మిర్చి - 10, దాల్చిన చెక్క ముక్కలు - 2, డాల్డా - 200 గ్రాములు
టమాటోలు- 1/4 కిలో, పచ్చిమిర్చి - 8, అల్లం ముక్క - 1, లవంగాలు - 1 చెంచా
మెంథాల్ - 10 గ్రాములు

తయారు చేసే విధానము

బియ్యం కడిగి ఒక బుట్టలో వేయాలి. టమాటోలు, కొబ్బరి కోరు, ఎండు మిర్చి, అల్లం ఒక బాండీలో నూనె లేకుండా వేయించి మెత్తగా రుబ్బుకొని ఒక గిన్నెలో పెట్టుకోవాలి. కుక్కర్‌లో డాల్డా వేసి మసాలా దినుసులన్నీ వేసి బాగా వేయించాలి. ఇందులోనే తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఆరబోసిన బియ్యాన్ని కూడా బాగా వేయించాలి. మనం రుబ్బిన ముద్ద వేసి కలపాలి. తీసుకొన్న బియ్యానికి ఒకటికి రెండింతలు నీరు పోసి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. తరిగిన పుదినా ఆకులను పైన వేసి మూత పెట్టాలి. కుక్కర్‌లో పెట్టి ఉడకనివ్వాలి. పలావ్ రెడీ.

బ్రెడ్ హల్వా

కావలసిన పదార్థాలు

బ్రెడ్‌లు - 2, పాలకోవా-1 కప్పు, జీడిపప్పు- 50 గ్రాములు, యాలకులు-4, పంచదార- 1 కిలో
పాలు- 1/2 లీటరు, ఎండుద్రాక్ష- 100 గ్రా
నెయ్యి - 100గ్రా

తయారు చేసే విధానము

ముందుగా బ్రెడ్‌లను పల్చగా, వెడల్పుగా కోసుకోవాలి. స్టౌ మీద గిన్నెపెట్టి నెయ్యి పోసి కాగనివ్వాలి. తర్వాత సన్నని సెగ మీద ఈ ముక్కల్ని ఎర్రగా వేయించాలి. పాలు కాగపెట్టి చల్లారిన తరువాత బ్రెడ్ ముక్కల్ని అందులో వేసి నానబెట్టాలి. తరువాత స్టౌ మీద గిన్నెలో ఇంకొంచెం నెయ్యి వేసి కాగిన తరువాత ద్రాక్ష, జీడి పప్పు, యాలకులు వేసి వేయించాలి.

అవి వేగిన తరువాత గ్లాసు నీళ్ళు పోసి పంచదార పోసి కలియ పెట్టాలి. కాసేపయ్యాక పాలలో నానవేసిన బ్రెడ్ ముక్కల్ని గిన్నెలో వేసి మళ్లీ కలపాలి. కొంచెం సేపు కలిపిన తరువాత కోవా వేసి సన్నటి సెగ మీద ఐదు నిమిషాలు ఉంచి దించేయాలి.





కొత్త పుస్తకాలు

ఆ కాలంలోకి తీసుకెళతాయి

కొన్ని నాటికలు స్టేజి మీద చూడడం అందం. కొన్ని చదువుకోవడం కూడా అందమే. ముని సుందరం చక్కటి శ్రావ్య నాటక రచయిత. 176 పేజీల్లో ఆణిముత్యాల్లాంటి నాటికలు అందించారు. అన్నీ రూపకాలు, చారిత్రక, పౌరాణిక నేపథ్యంలో సాగాయి. బౌద్ధమత జీవన స్రవంతికి మణి దర్పణాలు.. ఆ కాలంలోకి తీసుకెళతాయి. 'చరిత్రలో చినిగిన పుట'- అశోకుడి కాలం నాటి ముచ్చట్లు చెప్తే... 'వరూధినీ గాంధర్వం' మను చరిత్రలోని పద్యాలను యథాతథంగా ఏరుకొని సాగే రచన. 'ఏ వెలుగులకీ ప్రస్థానం' పలు చోట్ల ప్రదర్శించ బడింది. ఆకాశవాణి దూరదర్శన్- స్నేహితులకు బహుశా తెలిసే ఉంటుంది. రాజస్థాన్ చారిత్రక నేపథ్యంలో సాగిన నాటకం "దేశం నీ సర్వస్వం'. 1979 నాటి రచన 'మహాదాత'. మహాభారతం లోని కర్ణుడి గాథ.

భారతదేశంలో నాటకాలకు అంతో ఇంతో ఆదరణ బెంగాల్ తర్వాత నిక్కచ్చిగా మహారాష్ట్ర వాళ్లే ఇచ్చారు. అప్పుడో చోట ఇక్కడో చోట అన్ని నగరాల్లో ఢిల్లీ నుంచి గల్లీ దాకా నాటకాలాడిన , రేడియో, దూరదర్శన్లు మట్టుకు క్రమం తప్పకుండా ప్రేక్షకులకు, శ్రోతలకు నాటకాలందించాయి. రంజింపచేశాయి. ఆలోచించేలా తట్టి లేపాయి. కర్ణుడి చావుకి అనేక కారణాలు. నాటకాలు నేటికి సమాజంలో విడదీయలేని భాగాలే. సురభి నాటకాలు సైతం తడబడే రోజుల్లో నాటకాలకు, నాటక రచయితలకు రావాల్సిన గుర్తింపు, ఖ్యాతి రాలేదు. అయినా, ముని సుందరంగారు పరిణితి చెందిన నాటక రచయితగా తన అచంచల విశ్వాసంతో, ధైర్యసాహసాలతో కలానికీ, మేధస్సుకూ పని చెప్తూ ఇంకా చక్కటి నాటకాలను అందించాలి.

చారిత్రక పౌరాణిక రూపకాలు (నాటకాలు), పేజీలు: 176, వెల: రూ100/-, ప్రతులకు: ఎస్. లక్ష్మిరాజ్యం, 10-3-190, ఎ2 కె.కె. స్ట్రీట్, తిరుపతి-1.

డా॥ జె.పి. వైద్య



మనిషి కోసం

నానీలు

నాగిశెట్టి
వెల:35/-, పేజీలు:48
ప్రతులకు:
నాగిశెట్టి తాతయ్యనాయుడు, టీచర్
దక్షిణగడ్డ
దాచేపల్లి- 522 414, గుంటూరు.

స్వాతంత్ర్యోద్యమ జ్ఞాపకాలు

ఎం.ఎన్.రంగాచార్యులు
(పరకాల)
కూర్పు: రంగనాథ్ మిద్దెల
వెల:80/-, పేజీలు:132
ప్రతులకు:
'మన సంస్కృతి' పబ్లికేషన్స్
9-9-58, విశ్వకర్మ స్ట్రీట్,
వరంగల్.



విశ్లేషణాత్మక వ్యాసాలు

వ్యక్తుల సాహిత్య కృషిని భవిష్యత్ తరాలకు అందించడమే పనిగా పెట్టుకున్న వారిలో నాగసూరి వేణుగోపాల్ ఒకరు. ఆయన సాహిత్యం, సైన్స్, మీడియా, వంటి పలు రంగాల్లోని మంచిని తూర్పారబట్టి మెరికలని పాఠకలోకానికి అందిస్తుంటారు. అనేక పత్రికల్లో నాగసూరి రచనలు చేస్తుంటే ఆయన సామాజిక అవగాహన, సున్నితమైన విశ్లేషణ, గొప్ప అధ్యయనం కన్పిస్తుంది. నాగసూరి విమర్శకుడే కాదు. మంచి పాఠకుడు, ప్రేక్షకుడు కూడా. బుల్లి తెర గురించిన నాగసూరి వ్యాసాలు ఎంతో హుందాగా ఉంటాయి. రాయలసీమ కక్షల గురించి రాసినా, నానీల గురించి రాసినా, నట్టింట్లోని బుల్లితెర గురించి రాసినా, శ్రీశ్రీ వంటి మహా కవుల గురించి రాసినా తనదైన ప్రత్యేక ముద్ర వేస్తారు. సాహిత్యంలో పెను తుపాను లాంటి శ్రీశ్రీ లోని సైన్స్ భావాలను ఒక కొత్త కోణంలో ఆవిష్కరిస్తూ నాగసూరి రాసిన వాస్యం "శ్రీశ్రీ లోని ఒక శ్రీ సైన్స్" పలువురి దృష్టిని ఆకర్షించింది. ఇట్లాంటి వ్యాసాలలో కొన్నింటిని గుదిగుచ్చి "సాహితీ వీక్షణం" పేరుతో తీసుకొచ్చారు. ప్రముఖ సాహిత్య విమర్శకుడు సర్దేశాయి తిరుమలరావు గురించిన వ్యాసంలో సర్దేశాయి స్వగతాన్ని చెబుతూ 'తను ఏ యూనివర్సిటీలోనూ... ఏ అకాడమీలోను పని చేయలేదు. తనకు అవసరాలు లేవు. మొహమాటాలు లేవు. వారికి గుర్తింపులు, అవార్డులూ, పతకాలు అక్కర్లేదు. అందుకే తన పద్ధతిలో తను విమర్శ సాగించారన్న మాటలు కోట్‌చేసి సర్దేశాయి పూర్తి మూర్తిమత్వాన్ని పాఠకులకు అందించారు నాగసూరి. తెలుగు భాషా దుస్థితి గురించి పలువురు పలు పత్రికల్లోనూ, సమావేశాల్లోనూ పలు విధాలుగా వాపోతుంటారు. అదే క్రమంలో నాగసూరి వ్యాసం నేటి తెలుగు దిగజారుడుకు గల కారణాలను విశ్లేషిస్తూ "నేటి సామాజిక దుష్పరిణామాల విషపుత్రిక నిర్ద్వంద్వంగా తెలుగు టీవీ చానల్. అదే రంగుల మాయాలోకం. అక్కడ మేధతో పని లేదు. అంతా శరీర భాషే" (పేజీ నెం. 99). ఈ మాటలు చెప్పటం వెనుక నాగసూరి నిక్కచ్చితమైన పరిశీలన ఉంది. తెలుగు నాట వున్న తెలుగు వారికి తెలుగు మీద అభిమానం ఎంత? తమిళ రాష్ట్రంలోని తమిళులకు తమ మాతృభాషపై ఉన్న అభిమానంలో మన భాషాభిమానం ఎంత? అంటూ తెలుగును రక్షించుకుందామని ఆరాటపడి చేతులు దులుపుకునే వారికి చురకలు అంటించారు. నాటి గురజాడ, కొమర్రాజు, తాపీ ధర్మారావు, శ్రీపాద · వంటి ప్రముఖుల సాహిత్య సేవను విశ్లేషణాత్మక వ్యాసాలతో పాఠకులకు అందించిన నాగసూరి అభినందనీయుడు.



సాహితీ వీక్షణం
నాగసూరి వేణుగోపాల్
వెల:50/-, పేజీలు: 141,
ప్రతులకు: ఎస్. కె. పబ్లికేషన్స్,
24-8-1, సమీరా రెసిడెన్సీ
విజయనగరం.

ఐనాల సైదులు

పులి రాజా!

ఏంటి అలా ఆశ్చర్యపోతున్నారు? ఇంతకీ ఇతను మనిషా? పులా? అనా! తనను తాను పులిలా మార్చుకుంటున్న మనిషి. కళ్లు, మూతి, పళ్లు, చేతి గోళ్లు, చర్మం మీది మచ్చలు, వెంట్రుకలు, చెవులు...ఇలా ప్రతి అవయవమూ పులిలాగా కనిపించేందుకు అతగాడు పడిన తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా **100,000** డాలర్ల డబ్బు ఖర్చు చేశాడు. పాతిక సంవత్సరాలపాటు తంటాలు పడ్డాడు. అంతేకాదు! అందుకోసం దాదాపు 55 ఆపరేషన్లు చేయించుకున్నాడు.

'అవునా! వీడెవడ్రా బాబూ!' అనుకుంటున్నారు కదూ.

పేరు డెనిస్ అనెర్. పుట్టింది 1958లో మిచిగన్‌లో. మొదట్లో నేవీలో పనిచేసినా ప్రస్తుతానికి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చేస్తున్నాడు. కానీ ఎందుకో సరిగ్గా పాతికేళ్ల క్రితం ఇలా పులిలా మారాలని నిశ్చయించుకున్నాడు. మొట్టమొదటిసారిగా కంటిమీద పచ్చబొట్లు వేయించుకున్నాడు. మూతి, బుగ్గలు, గడ్డం ఉబ్బెత్తుగా వుండడానికి సిలికాన్ ఇంజక్షన్లు చేయించుకున్నాడు. తనకు సహజంగా వచ్చిన పళ్లన్నీ ఊడగొట్టించుకుని పులిపళ్లలాంటి పళ్ల సెట్‌ను పెట్టించుకున్నాడు. ముక్కు కనుబొమలు, చెవులు ఉబ్బెత్తుగా కనిపించేట్టు ఆపరేషన్ చేయించుకున్నాడు. పై పెదవి చీలినట్టు కనిపించడానికీ ఆపరేషన్ చేయించుకున్నాడు. వళ్లంతా పచ్చబొట్లు వేయించుకున్నాడు. పులి కళ్లలా కనిపించడానికి ఆకుపచ్చని కాంటాక్టు లెన్సులు వాడతాడు. గోళ్లు పెంచుతాడు. వాటికి బ్యుటీషియన్‌తో క్రమం తప్పకుండా రంగులు వేయిస్తుంటాడు. మూతి మీద పులికి మాదిరిగా 12 మీసాలను పెట్టించుకున్నాడు. ఫైబర్ గ్లాస్‌తో చేసిన ఈ మీసాలు ఆరు అంగుళాల పొడవుంటాయి. ఇలా చెప్పకుంటూ పోతే చాలా సంగతులే వున్నాయిలేగానీ...ఇంతకీ ఇతన్ని చూస్తుంటే మీకేమనిపిస్తోంది?

ఎవడి పిచ్చి వాడికి ఆనందమనా!
మాక్కూడా సేమ్ ఫీలింగ్ అండీ!!



నల్లి - దోమ

అనగనగా ఒక రాజు. ఆయన భలే లావుగా వుంటాడ్లే. మాంచి రుచికరమైన పదార్థాలు, పళ్లు ఆరగించడం, తియ్యటి రసాలు సేవించడం... విశ్రాంతి మందిరంలో పవళించడం. ఆయన సేదతీరే మంచం ఎంత బావుంటుందో! మాటలలో చెప్పలేం. నల్లకర్రతో చేసిన పేద్ద మంచం. దాని మీద మెత్తటి పట్టు పరుపులు... ఆ పక్కనే పేద్ద కిటికీ. కిటికీ పక్కనే పూదోట. సుమాల సువాసనలు అలా వచ్చి రాజుగారి ముక్కుపుటాలను సుతారంగా తాకుతుండేవి. అందుకే సుష్టుగా భోంచేయగానే ఆ మంచం మీద వాలిపోయేవాడు రాజు.

రాజుగారు నిద్రించే మంచానికి చాలా చరిత్రే వుంది. అది తరతరాలుగా రాజవంశీకులకు సుఖనిద్రను అందిస్తోంది. అలాగే ఎర్రటి నల్లుల కుటుంబానికి కూడా చక్కటి నిద్రను, విందు భోజనాన్ని అందిస్తోంది.

రాజుగారి మంచంలో బోలెడన్ని నల్లులు పిల్లా పాపలతో వర్ధిల్లుతున్నాయి. ఏమాత్రం కష్టపడకుండానే ఆహారం ఎదురుగా వుంటుంది. రాజు మంచం ఎక్కాడంటే...గంటలు గంటలు నిద్రపోతాడుకదా. ఆయన గురక పెట్టడం ప్రారంభించగానే మెల్లగా తంబలు తంబలుగా వచ్చి భారీ కాయం మీద దాడిచేస్తాయి. ఎంచక్కా రుచికరమైన ఆయన రక్తాన్ని జుర్రుకుంటాయి. కడుపు నిండా తాగాక బాన పొట్టలు వేసుకుని నడవలేక నడవలేక ఎలాగో మంచం నెర్రెల్లోకి వెళ్లి హాయిగా కునుకు తీస్తాయి. ఇలా వాటి జీవితం సాఫీగా సాగిపోయేది.

అయితే ఓసారి ఒక దోమ అటుగా వచ్చింది. నిద్రిస్తున్న రాజుగారిని చూచి ఆశగా వచ్చింది. సరిగ్గా ఆయన ముక్కుమీద వాలి రక్తం జుర్రుకోసాగింది. ఈలోగా... " ఏయ్! ఎంత ధైర్యం నీకు? మా రాజుగారి రక్తాన్ని మామిడిరసం తాగినట్టు తాగేస్తున్నావ్? ఆయ్! ఆయన రక్తం మీద మా నల్లులకు మాత్రమే హక్కు వుంది. మేం తరతరాలుగా ఇక్కడే వుంటున్నాం. మా తాతలు ఈ రాజు తాతల రక్తం తాగాయి. వాళ్ల తాతలు ... వీళ్ల తాతల రక్తం తాగాయి. మా పిల్లలు...ఈ రాజు కొడుకు రక్తం తాగుతాయి. తెల్సిందా! అయినా నీలాంటి లేబర్ దోమలు వస్తే మేం ఊరుకోం. అసల్దేంటి అంత మురికిగా వున్నావు? ముందు ఇక్కడి నుంచి నడువ్!" అంది పెద్ద నల్లి కోపంగా చూస్తూ.

రాజు రక్తం రుచి చూశాక దోమకు అక్కడి నుంచి వెళ్లబుద్ధి కాలేదు. 'ఆహా! ఈయన రక్తం నిజంగా ఎంత బావుందో! పైగా తాగేకొందీ తాగాలనిపిస్తోంది. బావిలో నీటి ఊటలా ఊరుతోంది కదా రక్తం. కనీసం ఒక గంట సేపైనా రాజు రక్తం తాగాలనిపిస్తోంది. కానీ శనిగ్రహంలాగా ఈ నల్లి ఒకటి తగులుకుంది. ఇప్పుడు దీన్ని వదిలించుకోవడం కుదిరేట్టు లేదు. అలాగని రాజుగారి రక్తం తాగకుండా వెళ్లే సమస్యే లేదు. ఏం చేద్దాం?" అని ఆలోచించసాగింది.

తను అంత కోపంగా చెప్పినా అక్కడినుంచి కదలకపోయేసరికి నల్లికి మరింత కోపం వచ్చింది.

"ఏయ్ దోమా! వినబడ్డం లేదా! చెవుడా! ఇది మా ఏరియా. రాజుగారి రక్తం మేం మాత్రమే తాగాలి. నువ్వు ముందు ఇక్కడి నుంచి వెళ్లిపో...." అని చీదరించుకుంటూ మాట్లాడింది.

ఇక చేసేది లేక కాళ్లబేరానికి వచ్చింది దోమ ...

"అది కాదండి నల్లిగారూ! నాకు ఈ రాజుగారి రక్తం బాగా నచ్చిందండీ. ఐదు నిముషాలంటే ఐదే నిముషాల సేపు రాజుగారి రక్తం తాగేసి వెళ్లిపోతానండీ...దయచేసి నన్ను అనుమతించండీ..." అంది దాదాపు కాళ్లమీద పడిపోయినట్టుగా.

అది అలా బ్రతిమాలుతుంటే నల్లికి తమాషాగా అనిపించింది. దోమ పదేపదే ప్రాధేయపడ్డాక... కాస్త ఫోజ్ పెట్టి...

"ఆ...ఏదో ఏడ్చిచస్తున్నావ్‌కనుక రాజుగారి రక్తం తాగడానికి అనుమతిస్తున్నా. అదీ రాత్రి పూటే తాగాలి సుమా. ఇవాళ రాత్రికి రా" అంది.

అక్కడే కిటికీ మీదే నిలబడి రాత్రి ఎప్పుడవుతుందా? అని ఎదురుచూడసాగింది దోమ. మెల్లగా చీకటిపడింది. రాజుగారు సుష్టుగా భోజనం చేసి ఆవలించుకుంటూ వచ్చి మంచం ఎక్కారు. దోమ మాత్రం యమ కంగారుగా వుంది. రాజుగారి రక్తం తాగేది ఎప్పుడా ఎప్పుడా అనుకుంటూ నల్లి ఆజ్ఞ కోసం ఎదురుచూడసాగింది. రాజుగారు పవళించిన కాసేపటికి నల్లి మంచంలోంచి బయటకు వచ్చి

"ఇదిగో దోమా! ఇప్పుడే చెప్తున్నా. రాజుగారు గాఢ నిద్రలోకి వెళ్లాకే నువ్వు రక్తం తాగడం మొదలెట్టాలి. అర్థమైందా!" అంటూ పచ్చ జెండా వూపింది.

దోమ సంతోషంగా వచ్చి రాజుగారి మీద వాలింది. తన పథకాన్ని ఆచరణలోకి పెట్టే సమయం ఇదే అనుకుంది. ఆయన ఇంకా పూర్తిగా నిద్రపోక మునుపే ...సూదిలాంటి ముక్కుతో కసిగా పొడిచి పొడిచి రక్తం లాగసాగాంది. దాంతో రాజుగారికి నిద్రాభంగమైంది. కాసేపు బద్ధకంగా అలాగే వుండిపోయాడు. కానీ దోమ కుడుతూనే వుంది. ఇక భరించలేక .... వెంటనే లేచి భటులను పిల్చి...

"మంచంలో నల్లులు వున్నట్టున్నాయి. వాటిని తక్షణం చంపేయండి. ఒక్క నల్లికూడా బ్రతికి వుండడానికి వీల్లేదు సుమా. బంగారం లాంటి మా నిద్ర చెడగొడుతున్న వాటికి ఇదే నేను విధిస్తున్న శిక్ష" అన్నాడు.

రాజాజ్ఞ ప్రకారం భటులు వెంటనే రంగంలోకి దిగి ...మంచంలోని నల్లులన్నిటనీ వెతికి వెతికి చంపేశారు. ఇదంతా కిటికీలోంచి చూస్తున్న దోమ ఎంతో సంతోషంగా....

"లేకపోతే... రాజుగారి శరీరం ఏదో వాటి సొత్తయినట్టు పెద్ద ఫోజు కొట్టాయి. వాటికి లాగే నన్ను కూడా రాజుగారి రక్తం తాగనిచ్చివుంటే ఇవాళ ఇలా చచ్చేవి కాదు కదా" అనుకుంది మనసులో.

- చూటీ

బాలల కథ